RNI NO: TEL/TEL/2009/28544

తెలంగాణ & ఆంధ్రప్రదేశ్

# పీపుల్స్ డైరీ

సమగ్ర వార్తా దినపత్రిక

విలువలతో కూడిన నిఖార్సయిన జర్నలిజం

సంపుటి : 18 | సంచిక : 113 | Vol : 18 | Issue : 113

Editor : KONDAPARTHI KIRAN
CELL : 9493019044

వరంగల్, శనివారం 27 జూన్ 2026
Warangal, Saturday 27 June 2026

పేజీలు : 08 | వెల రూ : 4-00

Pages : 08 | Price : 4-00


WANTED

పీపుల్స్‌డైరీ దినపత్రిక తెలంగాణ & ఏపీలోని వివిధ జిల్లాల్లో పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

సెంటర్లు

- హనుమకొండ
- కరీంనగర్
- భూపాలపల్లి
- పెద్దపల్లి/రామగుండం
- జనగామ
- మహబూబాబాద్
- హైదరాబాద్
- నిజామాబాద్

Cell : 9493019044
9618509859



## ఆపరేషన్ సిందూర్‌లో ఆరుగురు వీరమరణం

### తొలిసారి వివరాలు వెల్లడించిన కేంద్రం

- పహల్గామ్‌లో పర్యాటకులపై పాకిస్థాన్ ఉగ్రవాదులు దాడి
- మే 7వ తేదీన ఆపరేషన్ సిందూర్ చేపట్టిన భారత సైన్యం
- ఐదుగురు ఆర్మీ, ఐఏఎఫ్ సిబ్బంది సహా ఆరుగురు అమరులు

**పీపుల్స్‌డైరీ–న్యూఢిల్లీ :** గతేడాది ఏప్రిల్ 22న పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'లో కొంత మంది జవాన్లు వీరమరణం పొందారు. తొలిసారిగా ఆ అమర జవాన్ల వివరాలను కేంద్రం ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. అమరులైన జవాన్ల పేర్లను నేషనల్ వార్ మెమోరియల్ అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచింది. వీరిలో ఐదుగురు ఇండియన్ ఆర్మీకి చెందినవారు కాగా.. ఒకరు వైమానిక దళానికి

(మిగతా 2లో...)



## డ్రగ్స్ రహిత తెలంగాణే లక్ష్యం

- శాంతిభద్రతల సమస్యకు అవే కారణం
- డ్రగ్స్‌ను అంతం చేసేందుకు ప్రజలంతా కలిసిరావాలి
- యువత విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దు
- సీఎం రేవంత్ రెడ్డి

**పీపుల్స్‌డైరీ–హైదరాబాద్ :** మత్తు పదార్థాల మహమ్మారిని రూపుమాపి, ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించేందుకు ప్రజలంతా ఏకం కావాలని తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా వారు ప్రత్యేక సందేశాలు జారీ చేశారు. డ్రగ్స్ అలవాటు వ్యక్తుల జీవితాలనే కాకుండా కుటుంబాలను నాశనం చేస్తూ.. తీవ్ర శాంతి, భద్రతల

(మిగతా 2లో...)


## తెలంగాణ కొత్త సీఎస్‌గా సంజయ్ జాజు



### అధికారిక ఉత్తర్వులు ఇచ్చిన రేవంత్ సర్కార్

**పీపుల్స్‌డైరీ–హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ అధికారి సంజయ్ జాజు నియామకం అయ్యారు. ప్రస్తుత సీఎస్ కే రామకృష్ణారావు.. ఈనెల 30వ తేదీన పదవీ విరమణ చేయనుండగా.. ఆ తర్వాత సంజయ్ జాజు ఆ బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ క్రమంలోనే తెలంగాణ కొత్త సీఎస్‌గా సంజయ్ జాజును నియమిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ రేసులో పలువురు సీనియర్ ఐఏఎస్ అధికారుల పేర్లు వినిపించినా..

(మిగతా 2లో...)



## ఆకాశంలో నిరాశ!

- మబ్బుల జాడే లేదట
- శాటిలైట్ చిత్రాల్లో బయటపడ్డ వింత నిజం..
- వచ్చిన రుతు పవనాలు ఎక్కడ?
- అక్కడక్కడ మాత్రమే మేఘాలు

**పీపుల్స్‌డైరీ–న్యూఢిల్లీ :** రుతుపవనాలు దేశవ్యాప్తంగా విస్తరించినప్పటికీ, ఎక్కడా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవడం లేదు. దేశంలోని అత్యధిక ప్రాంతాల్లో ఆకాశం వింతగా, అసాధారణంగా మేఘాలు లేకుండా క్లియర్‌గా కనిపిస్తోంది. జూన్ 4 నుండి జూన్ 26 మధ్య కాలంలో దేశవ్యాప్తంగా ఏకంగా 45 శాతం వర్షపాత లోటు నమోదైందంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

భారత ఉపగ్రహం 'ఇన్శాట్–3డీఆర్' గురువారం ఉదయం తీసిన ఇన్‌ఫ్రారెడ్ చిత్రాలు వాతావరణ నిపుణులను ఆశ్చర్యానికి గురిచేశాయి. ఈ చిత్రాల ప్రకారం..

(మిగతా 2లో...)



## సీఎంఓలో మార్పులు

- అజిత్ రెడ్డికి ఉద్వాసన... శ్రీధర్‌కు చోటు
- సీఎం సలహాదారుగా రామకృష్ణారావు
- 13 మంది ఐఏఎస్‌ల బదిలీలు..
- సర్కార్ కీలక ఉత్తర్వులు

**పీపుల్స్‌డైరీ–హైదరాబాద్ :** రాష్ట్రంలో పలువురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ.. తెలంగాణ ప్రభుత్వం కీలక ఉత్తర్వులు వెలువరించింది. ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణరావును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సలహాదారుగా నియమించింది. ఈ క్రమంలోనే మొత్తం 13 మంది ఐఏఎస్ అధికారులకు.. బదిలీలు, పోస్టింగ్‌లు కల్పించింది. అదే సమయంలో సీఎంఓ నుంచి అజిత్ రెడ్డిని తొలగించింది. ఈ నేపథ్యంలోనే సీనియర్ ఐఏఎస్ శ్రీధర్‌కు సీఎంఓలో కీలక బాధ్యతలు అప్పగించారు. ఈ క్రమంలోనే సబ్యసాచి ఘోష్‌కు హ్యాండ్లూమ్స్, టెక్స్‌టైల్స్ శాఖ కార్యదర్శిగా

(మిగతా 2లో...)



## రాంగ్ రూట్ ప్రయాణం తెచ్చిన ముప్పు

- గచ్చిబౌలి ఫ్లైఓవర్‌పై ఘోర ప్రమాదం..
- స్కూటీని ఢీకొట్టిన బుల్లెట్ బైక్..
- తలలు రోడ్డుకు తగిలి ఇద్దరు అక్కడికక్కడే మృతి

**పీపుల్స్‌డైరీ–హైదరాబాద్ :** నగరంలోని ఐటీ కారిడార్ పరిధిలో శుక్రవారం ఉదయం ఒక ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. గచ్చిబౌలిలోని ఏఎంబీ మాల్ ఫ్లైఓవర్‌పై రాంగ్ రూట్‌లో ప్రయాణించిన ఒక స్కూటీని బుల్లెట్ బైక్ బలంగా ఢీకొట్టింది. ఈ భీకరమైన ప్రమాదంలో స్కూటీపై ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు రోడ్డుపై ఎగిరిపడి.. అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. నిబంధనలను ఉల్లంఘించి తప్పుడు మార్గంలో ప్రయాణించడంతో పాటు కనీస రక్షణ కవచమైన హెల్మెట్ ధరించకపోవడమే ఈ ఘోర ప్రాణనష్టానికి ప్రధాన కారణమని తెలుస్తోంది. ఆ పూర్తి వివరాలు మీకోసం. పోలీసులు, స్థానిక వర్గాల కథనం ప్రకారం.. శుక్రవారం ఉదయం సుమారు 7.30 గంటల సమయంలో వినోద్ అనే వ్యక్తి తన బుల్లెట్ బైక్‌పై (మిగతా 2లో...)



## లండన్‌లో కామారెడ్డి జిల్లా యువకుడి అనుమానాస్పద మృతి!

**పీపుల్స్‌డైరీ–వెబ్‌డెస్క్ :** ఉన్నత చదువుల కోసం లండన్ వెళ్లిన కామారెడ్డి జిల్లాకు చెందిన ఓ యువకుడు అక్కడ అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. కామారెడ్డి జిల్లా రాజంపేట మండలం తలమడ్ల గ్రామానికి చెందిన షాపుసాని మధుసూదన్ రెడ్డి, మంజుల దంపతుల కుమారుడు షాపుసాని శ్రీనాథ్ రెడ్డి(25) ఉన్నత విద్య కోసం లండన్ వెళ్లాడు. అక్కడ లీసెస్టర్ పట్టణంలోని ఓ ప్రముఖ యూనివర్సిటీలో ఎంఎస్ మొదటి సంవత్సరం విజయవంతంగా పూర్తి చేసి ప్రస్తుతం రెండో సంవత్సరం చదువుతున్నాడు. అంతా సవ్యంగా సాగుతోందనుకున్న సమయంలో శ్రీనాథ్ రెడ్డి హఠాన్మరణం అతడి కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది.

శ్రీనాథ్ రెడ్డి స్నేహితుడు అందించిన వివరాల ప్రకారం.. ఈనెల 22వ తేదీ రాత్రి శ్రీనాథ్ రెడ్డి తన స్నేహితుడి పుట్టినరోజు వేడుకలకు హాజరయ్యాడు. బర్త్‌డే పార్టీ ముగిసిన తర్వాత రాత్రి ఆలస్యంగా లండన్‌లోని తన గదికి చేరుకుని నిద్రపోయాడు. అయితే, మరుసటి రోజు ఎంతకీ శ్రీనాథ్ బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన అతడి స్నేహితుడు గదిలోకి వెళ్లి చూశాడు. అప్పటికే శ్రీనాథ్ రెడ్డి స్పృహ లేకుండా పడి ఉండటం, మరణించి ఉండటాన్ని గమనించిన స్నేహితుడు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యాడు. వెంటనే ఈ సమాచారాన్ని లండన్‌లో ఉన్న ఇతర మిత్రులకు చేరవేశాడు.

## టైటిల్ వార్!

- తెలంగాణ, ఆంధ్రా నెటిజన్ల మధ్య కొత్త చర్చ
- 'ఇడుపు కాయితం'తో మళ్లీ భాషా వివాదం
- అర్థం తెలియకుంటే తెలుసుకోండి...
- అవమానించడం తగదంటున్న తెలంగాణ ప్రజలు




**పీపుల్స్‌డైరీ–హైదరాబాద్ :** ఒక సినిమా టైటిల్... రెండు తెలుగు రాష్ట్రాల్లో పెద్ద చర్చకు దారి తీసింది. ప్రియదర్శి హీరోగా తెరకెక్కుతున్న 'ఇడుపు కాయితం' సినిమా ఫస్ట్ లుక్ విడుదలైన నాటి నుంచి సోషల్ మీడియాలో ఈ ఒక్క పదమే హాట్ టాపిక్‌గా మారింది. "ఇడుపు కాయితం అంటే ఏమిటి?" అంటూ ముఖ్యంగా ఆంధ్రా ప్రాంతానికి చెందిన నెటిజన్లు ప్రశ్నిస్తుంటే... తెలంగాణ ప్రజలు మాత్రం "ఇది మా పల్లెల మట్టి వాసనతో కూడిన అచ్చ తెలుగు పదం" అంటూ గర్వంగా చెప్పుకుంటున్నారు. సినిమా పోస్టర్ చూసిన వెంటనే ఇది తెలంగాణ గ్రామీణ నేపథ్యంలోని కథ అని స్పష్టమవుతోంది. దర్శకుడు దొండపాటి వంశీరెడ్డి తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో ప్రియదర్శి సరసన తెలుగు అమ్మాయి నాగదుర్గ హీరోయిన్‌గా నటిస్తోంది. అయితే సినిమా కథ కంటే ముందే దాని టైటిల్ చర్చనీయాంశమైంది.

### ఇడుపు కాయితం అంటే ఏమిటి?

ప్రస్తుతం చాలా మందికి ఈ పదం కొత్తగా అనిపిస్తోంది. ముఖ్యంగా నగరాల్లో పెరిగిన యువతకు, ఆంధ్రా ప్రాంత ప్రజలకు దీని అర్థం తెలియక సోషల్ మీడియాలో వరుస పోస్టులు కనిపిస్తున్నాయి. తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో "ఇడుపు కాయితం" అంటే విడాకుల పత్రం. భార్యాభర్తలు కలిసి జీవించడం సాధ్యం కాదని నిర్ణయించుకున్నప్పుడు... పెద్దల సమక్షంలో పరస్పర అంగీకారంతో రాసుకునే ఒప్పంద పత్రాన్నే (మిగతా 2లో...)

# డ్రగ్స్ రహిత తెలంగాణే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

సమస్యలకు కారణం అవుతోందని సీఎం రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు.

**డ్రగ్స్ ఉనికిని కనిపెట్టడం పౌరుల బాధ్యత కూడా..!**

మత్తు పదార్థాల వినియోగం కేవలం వ్యక్తిగత వినాశనానికే కాకుండా, సమాజంలో అనేక నేరాలకు, తీవ్రమైన శాంతి భద్రతల సమస్యలకు దారి తీస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నొక్కిచెప్పారు. డ్రగ్స్ ఉనికిని కనిపెట్టడంలో, వాటి అక్రమ రవాణాను అడ్డుకోవడంలో కేవలం పోలీసులు, ప్రభుత్వాలే కాకుండా పౌరుల అప్రమత్తత, సామాజిక బాధ్యత ఎంతో కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు. యువతలో నిరాశ, నిస్పృహలను దూరం చేసి.. వారిలో సానుకూల ఆలోచనలను పెంపొందిం చేందుకు సమాజం కృషి చేయాలన్నారు. తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చే పవిత్ర యజ్ఞంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సీఎం కోరారు.



ఈ సందర్భంగా గవర్నర్ శివప్రతాప్ శుక్లా మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వ్యసనం అనేది కేవలం ఒక వ్యక్తికి మాత్రమే పరిమితం కాదని, అది ఒక కుటుంబంతో పాటు యావత్ సమాజాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా దేశ సంపద అయిన యువత ఈ మాయలో పడి తమ విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. యువతంతా చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ, మంచి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని కోరారు. 'డ్రగ్స్ రహిత తెలంగాణ -- డ్రగ్స్ రహిత భారతదేశం' అనే గొప్ప లక్ష్యాన్ని సాధించేందుకు ప్రతి ఒక్క పౌరుడు నడుం బిగించాలని గవర్నర్ పిలుపునిచ్చారు.

**వికారాబాద్‌లో 2కే రన్.. అవగాహన సదస్సులు**

ఈ అంతర్జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ వ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక '2కే రన్'ను తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధికారికంగా జెండా ఊపి ప్రారంభించారు. మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా యువత, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు పెద్ద ఎత్తున ఈ పరుగులో పాల్గొని నినాదాలు చేశారు.





# ఆకాశంలో నిరాశ

(మొదటి పేజీ తరువాయి)

ఈశాన్య రాష్ట్రాలు, ఉత్తర బంగాళాఖాతం, దక్షిణ భారతదేశంలోని కొన్ని ప్రాంతాల్లో మాత్రమే మందపాటి మేఘాలు ఉన్నాయి. కానీ, దేశంలో అత్యధిక వ్యవసాయ భూములు ఉన్న మధ్య, పశ్చిమ, వాయువ్య భారత దేశాల్లో ఆకాశం అస్సలు మబ్బుల్లేకుండా ఎండగా ఉంది. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ-ఎన్‌సిఆర్ ప్రాంతాలలో దట్టమైన వర్షపు మేఘాల జాడే లేదు. రాష్ట్రాల వారీగా వర్షపాత లోటు ఇలా ఉంది: గుజరాత్: ఇక్కడ పరిస్థితి అత్యంత ఘోరంగా ఉంది. సాధారణం కంటే ఏకంగా 84 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. మధ్యప్రదేశ్: ఇక్కడ దాదాపు 50 శాతం మేర వర్షపాత లోటు ఉంది. ఉత్తరప్రదేశ్, బీహార్, ఒడిశా, కర్ణాటక, తమిళనాడు మరియు కేరళ రాష్ట్రాల్లో కూడా సాధారణం కంటే చాలా తక్కువ వర్షాలు కురిశాయి.

**అసలు రుతుపవనాలు ఎందుకు నెమ్మదించాయి?**

వాతావరణ నిపుణుల విశ్లేషణ ప్రకారం.. బంగాళాఖాతం, అరేబియా సముద్రాలలో బలమైన వాతావరణ వ్యవస్థలు (అల్పపీడనాలు) ఏర్పడకపోవడమే ఈ మందగమనానికి ప్రధాన కారణం. సాధారణంగా సముద్రంపై ఏర్పడే అల్పపీడనాలు



భూభాగం వైపు ప్రయాణిస్తూ తేమను మోసుకొస్తాయి. తద్వారా దేశం అంతటా విస్తారంగా వర్షాలు కురుస్తాయి. కానీ ఈ ఏడాది అటువంటి బలమైన వ్యవస్థలు ఏవీ ఏర్పడకపోవడంతో దేశ అంతర్భాగంలోకి తేమ శాతం తగ్గి, వర్షాలు మొహం చాటేశాయి.

# ఆపరేషన్ సిందూర్‌లో ఆరుగురు జవాన్లు వీరమరణం..

(మొదటి పేజీ తరువాయి)

చెందిన అగ్నివీర్ ఉన్నారు. దేశ రాజధాని ఢిల్లీలోని ఇండియా గేట్ వద్ద ఉన్న వార్ మెమోరియల్ వద్ద ప్రత్యేక శిలాఫలకంపై వీరి పేర్లను శాశ్వతంగా చెక్కనున్నారు.

అమరులైన జవాన్లలో 10 ఇన్‌ఫాంట్రీ బ్రిగేడ్ హెడ్‌క్వార్టర్స్‌కు చెందిన సుబేదార్ మేజర్ పవన్ కుమార్, జమ్మూ కశ్మీర్ లైట్ ఇన్‌ఫాంట్రీ రెజ్మెంట్ 4వ బెటాలియన్‌కు చెందిన రైఫిల్‌మ్యాన్ సునీల్ కుమార్, 5 ఫీల్డ్ రెజిమెంట్ లాన్స్ నాయక్ దినేశ్ కుమార్, 237 ఫీల్డ్ వర్క్‌షాపు హవల్దార్ సునీల్ కుమార్ సింగ్, ఎయిర్‌ఫోర్స్ 39వ వింగ్ సార్జెంట్ సురేంద్ర కుమార్, 851 లైట్ రెజ్మెంట్ అగ్నివీర్ మురళీ నాయక్ ఉన్నారు. వీరిలో రైఫిల్‌మ్యాన్ సునీల్ కుమార్‌కు మరణానంతరం మూడో అత్యున్నత సైనిక పురస్కారం 'వీర చక్ర'తోనూ, సార్జెంట్ సురేంద్ర కుమార్‌ను 'వాయు మెడల్'తో కేంద్ర ప్రభుత్వం సత్కరించింది.

అగ్నివీర్ మురళీ నాయక్ ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసత్యసాయి జిల్లా కళ్లితండాకు చెందినవారు. 2022లో అగ్నివీర్‌గా ఎంపికైన మురళీ నాయక్ ముందు పంజాబ్, అసోంలో విధులు నిర్వర్తించారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో జమ్మూ కశ్మీర్ సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తూ ఎదురు కాల్పుల్లో అమరుడయ్యారు. పహల్గాంలో పాకిస్థాన్ ఉగ్రవాదులు పర్యాటకులపై జరిపిన కాల్పుల్లో 26 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. దీనికి ప్రతీకారంగా 2025 మే 7వ తేదీ అర్ధరాత్రి తర్వాత ఆపరేషన్ సిందూర్ పేరుతో పాకిస్థాన్, పీఓకేలోని జైషే మహమ్మద్, లష్కరే తొయిబా, హిజ్బుల్ ముజాయిద్దీన్ ఉగ్రవాద సంస్థలకు చెందిన తొమ్మిది శిబిరాలపై భారత సైన్యం విరుచుకుపడింది. దీంతో ఇరు దేశాల మధ్య నాలుగు రోజుల పాటు కొనసాగిన ఉద్రిక్తతలు మే 10 కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందంతో తగ్గుముఖం పట్టాయి.

ఇక, అమరవీరులకు అంకితం చేసిన జాతీయ యుద్ధ స్మారకం 16 వృత్తాకార గ్రానైట్ గోడలతో ఉంటుంది. స్వాతంత్ర్యం తర్వాత దేశం కోసం తమ ప్రాణాలను అర్పించిన ప్రతి సైనికుడి పేరు, హోదా, యూనిట్ ఈ గోడలపై చెక్కబడి ఉంటాయి. ఆపరేషన్ సింధూర్‌కు చెందిన ఈ ఆరుగురు వీరులు కూడా ఈ స్మారక చిహ్నంలో శాశ్వతంగా ఉండనున్నాయి.



# రాంగ్ రూట్ ప్రయాణం తెచ్చిన ముప్పు

గచ్చిబౌలి వైపు నుంచి హాఫీజ్‌పేట్ వైపు సాధారణ వేగంతో ప్రయాణిస్తున్నాడు. అదే సమయంలో హాఫీజ్‌పేట్ వైపు నుంచి గచ్చిబౌలి వైపునకు శ్రీకాంత్, విఠల్ అనే ఇద్దరు వ్యక్తులు స్కూటీపై బయలుదేరారు. అయితే వారు ట్రాఫిక్ నిబంధనలను పూర్తిగా పక్కనబెట్టి ఏఎంబీ మాల్ ఫ్లైఓవర్‌పై రాంగ్ రూట్‌లోకి దూసుకువచ్చారు.

**హెల్మెట్ లేకపోవడంతో ఇద్దరి ప్రాణాలు గాల్లోకి..!**

ఫ్లైఓవర్ మలుపు వద్దకు రాగానే.. సరైన మార్గంలో వస్తున్న వినోద్ బుల్లెట్ బైక్.. రాంగ్ రూట్‌లో ఎదురుగా వస్తున్న శ్రీకాంత్, విఠల్‌ల స్కూటీని అతి బలంగా ముఖాముఖి ఢీకొట్టింది. ఈ తీవ్రమైన ప్రభావానికి స్కూటీపై ఉన్న శ్రీకాంత్, విఠల్ ఇద్దరూ గాల్లోకి లేచి ఫ్లైఓవర్ కాంక్రీట్ రోడ్డుపై చాలా దూరంలో పడిపోయారు. ప్రమాద తీవ్రతకు రెండు వాహనాలు పూర్తిగా నుజ్జునుజ్జు కాగా.. ప్రమాద సమయంలో వీరిద్దరూ హెల్మెట్ ధరించకపోవడంతో వారి తలలు రోడ్డుకు అత్యంత బలంగా తగిలి తీవ్రమైన రక్తస్రావమైంది. ఈక్రమంలోనే వారిద్దరూ ఘటనా స్థలంలోనే ప్రాణాలు విడిచారు. కాగా బుల్లెట్ బైక్‌పై ఉన్న వినోద్‌కు ఈ ప్రమాదంలో స్వల్ప గాయాలు అయ్యాయి.



# సీఎంఓలో మార్పులు

(మొదటి పేజీ తరువాయి)

అదనపు బాధ్యతలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం అప్పగించింది. అదే సమయంలో శైలజా రామయ్యర్‌ను ఈఎఫ్ఎస్ అండ్ టీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా బదిలీ చేసింది. అహ్మద్ నదీమ్‌కు పొలిటికల్ (జీఏడీ) ప్రిన్సిపల్ సెక్రటరీగా బాధ్యతలు అప్పగించింది. ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీగా ఎన్ శ్రీధర్.. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీగా రాహుల్ బొజ్జాకు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతలు ఇచ్చింది.

మైన్స్ అండ్ జియాలజీ శాఖ అదనపు బాధ్యతలను ఎం.రఘునందన్ రావుకు రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. ఇన్వెస్ట్ తెలంగాణ సీఈవోగా అజిత్ రెడ్డిని ట్రాన్స్‌ఫర్ చేసింది. హ్యాండ్లూమ్స్ అండ్ హ్యాండీక్రాఫ్ట్స్ స్పెషల్ సెక్రటరీగా పి. కాత్యాయని దేవికి పోస్టింగ్ ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం.. ఆర్అండ్‌బీ శాఖ స్పెషల్ సెక్రటరీగా కె. గంగాధర్‌ను బదిలీ చేసింది. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్‌గా టి. వెంకన్నకు పోస్టింగ్ ఇచ్చింది. టూరిజం డైరెక్టర్‌గా కె. విద్యాసాగర్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఈ క్రమంలోనే తెలంగాణ ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంఓ)లో కీలకమైన మార్పులకు రేవంత్ రెడ్డి సర్కార్ శ్రీకారం చుట్టారు. పాలనా యంత్రాంగాన్ని మరింత పరుగులు పెట్టించడంలో భాగంగా సీఎంవోలో భారీ ప్రక్షాళన చేపట్టింది. గత కొంతకాలంగా సీఎంవోలో కీలక బాధ్యతల్లో ఉన్న అజిత్ రెడ్డిని తీసేసి.. శ్రీధర్‌కు చోటు కల్పించారు. శ్రీధర్ రాకతో సీఎంవోలో పాలనాపరమైన నిర్ణయాలు మరింత వేగం పుంజుకుంటాయని తెలంగాణ సచివాలయ వర్గాలు ఆకాంక్షిస్తున్నాయి.

# తెలంగాణ కొత్త సీఎస్‌గా సంజయ్ జాజు

(మొదటి పేజీ తరువాయి)

రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాత్రం సంజయ్ జాజు వైపే మొగ్గింది. తెలంగాణ కేడర్‌కు చెందిన సంజయ్ జాజు.. 1992 బ్యాచ్ ఐఏఎస్ అధికారి కావడం గమనార్హం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మీ సేవతోపాటు పలు కీలక ఐటీ ప్రాజెక్టులను ప్రారంభించిన సంజయ్ జాజు చివరగా కేంద్ర సర్వీసుల్లో పనిచేశారు.

తెలంగాణ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి చేసిన విజ్ఞప్తితో.. ఇటీవల 3 రోజుల క్రితం కేంద్ర ప్రభుత్వ సర్వీసుల నుంచి సంజయ్ జాజును రిలీవ్ చేశారు. మినిస్ట్రీ ఆఫ్ డెవలప్‌మెంట్ ఆఫ్ నార్త్ ఈస్టర్న్ రీజియన్ సెక్రటరీగా ఉన్న సంజయ్ జాజును తెలంగాణకు కేటాయిస్తూ.. కేంద్ర సిబ్బంది, శిక్షణా వ్యవహారాల శాఖ (డీఓపీటీ) డైరెక్టర్ అన్నీస్ కన్మణి జాయ్ ఇప్పటికే ఉత్తర్వులు విడుదల చేశారు.

సీనియర్ ఐఏఎస్ సంజయ్ జాజు 1992 బ్యాచ్‌కు చెందిన అధికారి కాగా.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆయన తన పనులతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. విజయవాడ జిల్లా సబ్ కలెక్టర్‌గా.. పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్‌గా.. హైదరాబాద్ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్‌గా.. కమిషనర్‌గా, పౌరసరఫరాల సంస్థ కమిషనర్‌గా కూడా సంజయ్ జాజు సేవలు అందించారు. మీ సేవ, మున్సిపల్ సేవల్లో మరింత పారదర్శకతను తీసుకువచ్చే ఐటీ ప్రాజెక్టులకు సంజయ్ జాజు ప్రవేశపెట్టారు.

# క్రికెటర్ రిశ్వంత్ వర్మకు సన్మానం



**పీపుల్స్‌డైరీ-హనుమకొండ :** నేపాల్ దేశంలో జరగబోయే అండర్ 17 క్రికెట్ పోటీలకు ఎంపికైన ములుగు జిల్లా తాడ్వాయి మండలం కాటాపురం గ్రామానికి చెందిన తోట రిశ్వంత్ వర్మ కు వరంగల్ జిల్లా పెరిక కుల సంఘం అధ్యక్షులు అల్లం రాజేష్ వర్మ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం శుక్రవారం జరిగింది. రిశ్వంత్ వర్మను శాలువాతో సత్కరించి, నగదు ప్రోత్సాహకం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన పెరిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దొంగరి మనోహర్, కార్యనిర్వహక కార్యదర్శి కీత విజయ్ కుమార్, వరంగల్ జిల్లా గౌరవ అధ్యక్షులు బరపటి గోపి మాట్లాడుతూ రిశ్వంత్ వర్మ మంచి ఆట తీరును కనబరిచి భవిష్యత్తులో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో పెరికధాత్రి ఎడిటర్ బరుపటి సంపత్ కుమార్, యూత్ కన్వీనర్ అంకతి అభిలాష్ కుమార్, కో కన్వీనర్ బిల్లా భగత్ కుమార్, జర్నలిస్టులు మంచాల రాజు, గొల్ల నరేందర్, అడ్వకేట్ యెగ్గడి సుందర్ రామ్, ఎసిరెడ్డి ప్రభాకర్, పూజారి వెంకటేశ్వర్లు, పూజారి రమేష్,తోట నగేష్, తదితరులు పాల్గొన్నారు.

# టైటిల్ వార్...

(మొదటి పేజీ తరువాయి)

ఇడుపు కాయితం అంటారు. నేడు విడాకుల కోసం కోర్టులను ఆశ్రయిస్తున్నా... ఒకప్పుడు గ్రామీణ సమాజంలో పెద్దల తీర్పే అంతిమం. ఆ సమయంలో రాసుకునే ఆ పత్రానికి ఈ పేరు వచ్చింది.

తెలంగాణ మాండలికంలో "ఇడుపు" లేదా "ఇడుసు" అంటే వదిలేయడం, విడిచిపెట్టడం అనే అర్థం. అందుకే విడిపోతున్న దంపతులు రాసుకునే పత్రాన్ని "ఇడుపు కాయితం"గా పిలిచేవారు. ఇప్పటికీ కొన్ని గ్రామాల్లో ఈ పదం వినిపిస్తూనే ఉంటుంది.

**టైటిల్‌తో మళ్లీ మొదలైన భాషా చర్చ**

ఈ ఒక్క పదం మళ్లీ ఆంధ్రా-తెలంగాణ నెటిజన్ల మధ్య భాషా చర్చకు తెరతీసింది. "ఇడుపు కాయితం సినిమాకు ఆంధ్రాలో తెలుగులో డబ్బింగ్ ఉంటుందా?" అంటూ కొందరు వ్యంగ్యంగా పోస్టులు చేయగా... "తెలంగాణ భాషలోనే చూస్తామా? కనీసం సబ్‌టైటిల్స్ అయినా వేయండి" అంటూ మరికొందరు సెటైర్లు వేశారు.

ఈ వ్యాఖ్యలపై తెలంగాణ నెటిజన్లు తీవ్రంగా స్పందిస్తున్నారు. గతంలో ఆంధ్రా మాండలికంలోని ఎన్నో పదాలు సినిమాల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా వినిపించాయని, వాటిని ఎవరూ ఎగతాళి చేయలేదని గుర్తుచేస్తున్నారు. కానీ తెలంగాణ మాండలికం తెరపైకి వస్తే మాత్రం అది తెలుగు కాదా? అంటూ ప్రశ్నించడం బాధాకరమని అంటున్నారు.

సోషల్ మీడియాలో తెలంగాణకు చెందిన నెటిజన్ చేసిన వ్యాఖ్య కూడా వైరల్ అవుతోంది. తెలంగాణ యాసను ఎగతాళి చేస్తూ డబ్బింగ్, సబ్‌టైటిల్స్ అంటూ కామెంట్లు చేయడం వెనుక భాషపై ప్రేమ కంటే ప్రాంతీయ వివక్షే ఎక్కువగా కనిపిస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు.

**భాష కాదు... సంస్కృతి**

వాస్తవానికి ప్రతి ప్రాంతానికీ తనదైన యాస, పదజాలం, సంస్కృతి ఉంటాయి. కోస్తా, రాయలసీమ, తెలంగాణ... మూడు ప్రాంతాల్లోనూ తెలుగు ఒకటే. కానీ మాట తీరు, పదాల వాడుక, భావవ్యక్తీకరణ మాత్రం భిన్నంగా ఉంటుంది. ఆ భిన్నత్వమే తెలుగు భాష అందం.

ఒక సినిమా టైటిల్ చుట్టూ మొదలైన ఈ చర్చ... చివరికి తెలుగు భాష వైవిధ్యాన్ని అర్థం చేసుకునే అవకాశంగా మారితేనే దానికి నిజమైన అర్థం ఉంటుంది.

అయితే అదే సమయంలో ప్రాంతీయ భావోద్వేగాలను రెచ్చగొట్టేలా సోషల్ మీడియాలో జరుగుతున్న వాదోపవాదాలు రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల మధ్య అనవసర దూరాన్ని పెంచకుండా ఉండాల్సిన అవసరం కూడా ఉంది.



# డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా ఎస్పీ సంకీర్త్



**భూపాలపల్లి జూన్ 26 పీపుల్స్ డైరీ :** అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పోలీస్ ఆధ్వర్యంలో డ్రగ్స్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వా ములు కావాలని, డ్రగ్స్, గంజాయికి దూరంగా ఉండాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, పిలుపు నిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రగ్స్ అవగాహన ర్యాలీలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా పాల్గొని, జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్‌తో కలిసి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని గణేష్ చౌక్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు నిర్వహించిన ర్యాలీలో ప్రజలు, విద్యార్థులు, ప్రభుత్వ అధికారులు, పోలీసు అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అంబేద్కర్ సెంటర్‌లో మానవహారం నిర్వహించి, "డ్రగ్స్, గంజాయి రహిత సమాజ నిర్మాణానికి కృషి చేద్దాం" అంటూ ప్రతిజ్ఞ చేశారు. అలాగే డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కల్పించే సంతకాల సేకరణ కార్యక్రమాన్ని కూడా చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ, మాదక ద్రవ్యాలు యువత భవిష్యత్తును, కుటుంబాలను నాశనం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్ నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని, ప్రతి ఒక్కరూ బాధ్యతతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ మాట్లాడుతూ, డ్రగ్స్ రవాణా, విక్రయాలపై పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకుంటూ నిరంతరం నిఘా కొనసాగి స్తోందన్నారు. అయితే కేవలం పోలీసుల చర్యలతోనే కాకుండా ప్రజలు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సహా సమాజంలోని ప్రతి ఒక్కరూ సహకరిస్తేనే డ్రగ్స్ రహిత సమాజం సాధ్యమవు తుందన్నారు. అనుమానాస్పద డ్రగ్స్ కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అలాగే తెలంగాణ ప్రభుత్వం డ్రగ్స్‌కు బానిసైన వారి పునరావాసం కోసం ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేస్తోందని తెలిపారు. డ్రగ్స్ అలవాటు ఉన్నవారు భయప డకుండా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రీహాబిలిటేషన్ సెంటర్లలో చికిత్స పొందాలని సూచించారు. స్వయంగా పోలీసులను సంప్రదించి చికిత్సకు సిద్ధమయ్యే వారికి పునరావాసం కల్పించడంతో పాటు, చట్టపరమైన నిబంధనల మేరకు వారికి సం బంధించిన కేసుల ఉపసంహరణకు ప్రభుత్వం అవ కాశం కల్పించిందని తెలిపారు. డ్రగ్స్ బారిన పడిన వారిని నేరస్థులుగా కాకుండా సమాజంలో తిరిగి మంచి పౌరులుగా తీర్చిదిద్దడమే పోలీస్ శాఖ లక్ష్యమని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు కూడా అలాంటి వారిని రీహాబి లిటేషన్ సెంటర్లకు తీసుకువెళ్లి చికిత్స అందేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# కుల మతాలకు అతీతంగా జరుపుకునే పండుగ మొహరం

- 18వ వార్డు మాజీ కౌన్సిలర్ భవాని రాఘవేందర్ గౌడ్



**మేడ్చల్, జూన్ 26(పీపుల్స్ డైరీ):-** మేడ్చల్ పట్టణంలో మొహరం (ఫీర్ల) పండుగను పురస్కరించుకుని నిర్వహించిన వేడుకలు భక్తిశ్రద్ధలతో, మత సామరస్య వాతావరణంలో ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో మేడ్చల్ 18వ వార్డు మాజీ కౌన్సిలర్ భవాని రాఘవేందర్ గౌడ్ కుటుంబ సమేతంగా పాల్గొని దట్టి సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా భవాని రాఘవేందర్ గౌడ్ మాట్లాడుతూ, మొహరం పండుగ కుల, మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరినీ ఐక్యంగా నిలిపే పండుగ అని అన్నారు. హిందూ, ముస్లిం సోదరులు కలిసి భక్తి, పరస్పర గౌరవంతో ఈ పండుగను జరుపుకోవడం మన దేశ గొప్ప సంస్కృతికి నిదర్శనమని పేర్కొన్నారు. సమాజంలో శాంతి, సామరస్యం, సోదరభావం మరింత బలపడాలంటే ప్రతి ఒక్కరూ మత సామరస్యాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. మేడ్చల్ పట్టణ ప్రజలు మొహరం వేడుకలను ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహించడం ఆనందంగా ఉందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పట్టణ ప్రజలందరికీ మొహరం పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, అందరి జీవితాల్లో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, అభివృద్ధి నెలకొనాలని ఆకాంక్షించారు. అనంతరం నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొని భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మత పెద్దలు, యువకులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొహరం వేడుకలను ఘనంగా నిర్వహించారు.

# సంక్షేమ పథకాలు ప్రతి అర్హునికీ చేరాలి -జిల్లా ప్రత్యేక అధికారి వికాస్ రాజ్





## సమగ్ర అభివృద్ధే లక్ష్యం ప్రజాపాలన ప్రగతి

**మేడ్చల్, జూన్ 26(పీపుల్స్ డైరీ):** ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి, వాటిని మానవీయ కోణంలో పరిష్కరించడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ప్రత్యేక అధికారి, రోడ్లు-భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ఐఏఎస్ సూచించారు. మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ మను చౌదరి, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ కోటిరెడ్డి, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, విజయేందర్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వికాస్ రాజ్ మాట్లాడుతూ, ప్రభుత్వం రూపొందించిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక రాష్ట్రంలో సమగ్ర అభివృద్ధికి బాటలు వేసిందన్నారు. వార్డు సభలు, జిల్లా స్థాయి సమావేశాల ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. 10 థీమ్‌ల ఆధారంగా అన్ని శాఖలు చేపట్టిన కార్యక్రమాలు విజయవంతంగా పూర్తయ్యాయని పేర్కొన్నారు. విద్యారంగంలో విశేష పురోగతి విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో 510 ప్రభుత్వ పాఠశాలల్లో 85,252 మంది విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, చెప్పులు, సాక్స్, అల్పాహారం, మధ్యాహ్న భోజనం, పాలు, రాగి జావ పంపిణీ చేశారని తెలిపారు. కొత్తగా 24 ప్రాథమిక పాఠశాలలు మంజూరు కాగా, 9 పాఠశాలలు ప్రారంభ మయ్యాయి. 27 ప్రీ-ప్రైమరీ విభా గాలు ఏర్పాటు చేయగా, మరో 145 విభాగాల ప్రతిపాదనలు సిద్ధం చేశారు. బడిబాట కార్యక్రమం ద్వారా సుమారు రెండు వేల మంది విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించారు. అన్ని ప్రభుత్వ విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్, ఇంటర్నెట్ సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు.

## రైతు సంక్షేమానికి పెద్దపీట

వ్యవసాయ శాఖ ద్వారా 25,932 మంది రైతులకు రూ.15.58 కోట్ల రైతు భరోసా, 37 మంది రైతు కుటుంబాలకు రూ.1.85 కోట్ల రైతు బీమా ఆర్థిక సాయం అందించారు. రైతుల వారోత్సవాలు నిర్వహించి మట్టి ఆరోగ్య నిర్వహణ, మట్టి ఆరోగ్య కార్డులు, సహజ వ్యవసాయం, డిజిటల్ పంట నమోదు, నానో యూరియా, సౌర పంప్‌సెట్లు, కిసాన్ డ్రోన్ల వినియోగంపై అవగాహన కల్పించారు. ఆరోగ్య సేవల విస్తరణ ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో 122 రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. రక్తపోటు, మధుమేహం, క్షయవ్యాధి నియంత్రణ, దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణ, హీట్‌వేవ్ నిర్వహణ, గర్భిణీల ఆరోగ్య పరీక్షలు వంటి కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేశారు. వేలాది మందికి పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్సలు అందించారు.


## సంక్షేమ శాఖల ద్వారా విద్య, ఉపాధికి ప్రోత్సాహం

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖల ద్వారా ప్రీమెట్రిక్, పోస్టుమెట్రిక్ ఉపకార వేతనాలు, విదేశీ విద్య కోసం 127 మంది విద్యార్థులకు రూ.25.41 కోట్ల ఆర్థిక సాయం అందించారు. హాస్టళ్ల మరమ్మతులు, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు, తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించారు.

## గృహాలు, రవాణా, మున్సిపల్ సేవల్లో పురోగతి

ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద జిల్లాలో 2,249 ఇళ్లు మంజూరు చేయగా, తొలి విడతలో 444 మంది లబ్ధిదారులకు గృహప్రవేశాలు నిర్వహించారు. 37,056 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణ పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. రవాణా శాఖ ఆధ్వర్యంలో రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమాలు, హెల్మెట్, సీటుబెల్ట్ వినియోగం, ట్రాఫిక్ నిబంధనలపై ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. సైబరాబాద్, మల్కాజిగిరి, అలియాబాద్, ఎల్లంపేట, ముడూచింతలపల్లి మున్సిపల్ పరిధుల్లో డ్రైన్ల శుభ్రత, ఫాగింగ్, చెత్త తొలగింపు, వర్షాకాల సన్నద్ధత, ప్రజా ఆరోగ్య పరిరక్షణ చర్యలు చేపట్టారు. మహిళా, శిశు సంక్షేమం పర్యావరణ పరిరక్షణ మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సేవల విస్తరణ, బాల్య వివాహాల నివారణ, పోషకాహార కార్యక్రమాలు, మహిళా సాధికారతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా 10 వేల మొక్కలు నాటడంతో పాటు అడవుల సంరక్షణపై ర్యాలీలు, విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్మూలన, వ్యర్థాల వర్గీకరణ, పర్యావరణ పరిరక్షణపై విద్యాసంస్థలు, పారిశ్రామిక ప్రాంతాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశం సమావేశం ముగింపులో జిల్లా కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ, 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక జిల్లాలో విజయవంతంగా అమలైందన్నారు. అనంతరం జిల్లా ప్రత్యేక అధికారి వికాస్ రాజ్ అన్ని శాఖల అధికారులు తమ శాఖల విజయాలు, ఉత్తమ విధానాలు, ఫొటోలు, సాధించిన ఫలితాలతో కూడిన సమగ్ర నివేదికలను సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించాలని ఆదేశించారు. శాఖల మధ్య సమన్వయం పెంచి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని సూచించారు. వర్షాకాలంలో నీరు నిలిచే ప్రాంతాలను ముందుగానే గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.

# దక్షిణాసియా రాక్‌బాల్ టోర్నమెంట్‌కు భారత జట్టులో పూడూరు యువకుడు ఎంపిక




**మేడ్చల్, జూన్ 26(పీపుల్స్ డైరీ):-** నేపాల్ రాజధాని ఖాట్మండులో జూన్ 27 నుంచి ప్రారంభం కానున్న ప్రతిష్టాత్మక మొదటి దక్షిణాసియా రాక్‌బాల్ టోర్నమెంట్లో పాల్గొనే భారత జాతీయ జట్టుకు మేడ్చల్ మండలంలోని పూడూరు గ్రామానికి చెందిన యువ క్రీడాకారుడు గోపాల్ యాదవ్ ఎంపికయ్యారు. దేశవ్యాప్తంగా నిర్వహించిన రాక్‌బాల్ క్రీడా ప్రదర్శనల్లో ప్రతిభ కనబరిచిన గోపాల్ యాదవ్‌ను జాతీయ సెలెక్టర్లు భారత జట్టుకు ఎంపిక చేశారు. అంతర్జాతీయ వేదికపై భారతదేశానికి ప్రాతినిధ్యం వహించే అవకాశం లభించడం తనకు ఎంతో గౌరవంగా ఉందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా గోపాల్ యాదవ్ మాట్లాడుతూ, "భారత జట్టు తరపున అత్యుత్తమ ప్రదర్శన కనబర్చి దేశానికి కీర్తి తీసుకురావడమే నా లక్ష్యం. అందరి ఆశీస్సులు, సహకారంతో అత్యుత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తాను" అని పేర్కొన్నారు. అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన గోపాల్ యాదవ్‌ను ఆయన కుటుంబ సభ్యులు, స్నేహితులు, క్రీడాభిమానులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు గ్రామ పెద్దలు హృదయ పూర్వకంగా అభినందించారు. దక్షిణాసియా టోర్నమెంట్‌లో భారత జట్టు విజయవంతంగా రాణించాలని, గోపాల్ యాదవ్ మరిన్ని విజయాలతో దేశానికి, తెలంగాణకు, పూడూరు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# పల్స్ పోలియోకు ఏర్పాట్లు పూర్తి...




**భూపాలపల్లి జూన్ 26 పీపుల్స్ డైరీ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 34,728 మంది పిల్లలకు వ్యాక్సిన్ వేసేందుకు 296 బూతులు 14 మొబైల్ టీం లతో వ్యాక్సిన్ పర్యవేక్షణ వ్యాక్సిన్ పంపిణీకి ఏర్పాట్లు పూర్తి. 28న దేశవ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమం, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్నాయి. చిన్నారులు నిండు ప్రాణానికి రెండు పోలియో చుక్కలు అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నాయి, పోలియో రహిత సమాజం కోసం ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాయి. 0 నుండి 5 ఏళ్ల వయసు గల చిన్నారులు ఇలాంటి అనారోగ్య సమస్యలతో శతమతమవుతున్న విధిగా రెండు పోలియో చుక్కలు వేయించాల్సిన బాధ్యత అందరి పైన ఉంది, ప్రతి ఒక్కరూ పల్స్ పోలియో చుక్కల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ మధుసూదన్ కోరారు. ఈ నెల 28, 29, 30 తేదీలలో 0 నుండి 5 సంవత్సరాల పిల్లలకు పోలియో వ్యాక్సిన్ ఇస్తామని జిల్లా నందుగల 241 గ్రామ పంచాయతీలలో అంగన్వాడీ కేంద్రాలలో, పాఠశాలలలో ఆదివారం రోజు పోలియో చుక్కలు వేస్తామన్నారు సోమవారం మంగళవారం లలో ఇంటింటికి తిరిగి మిగతా పిల్లలకు పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం పరుచుకొని మీ పిల్లల ఆరోగ్యాన్ని కాపాడాలని అన్నారు.

# నూతన జంటను ఆశీర్వాదించిన సీపీఎం నేతలు



**సింగరేణి (కారేపల్లి) జూన్ 26 (పీపుల్స్ డైరీ) :** సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు-ఉమావతి దంపతుల చిన్న కుమారుడు కొండబోయిన రాకేష్-రవళి ల వివాహం గురువారం పండితాపురంలోని వెంకటేశ్వర పంక్షన్ హాల్ జరిగింది. ఈ వేడుకకు అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి బి.వెంకట్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్, పొన్నం వెంకటేశ్వర్లు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, సీపీఎం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కార్యదర్శు లు నున్నా నాగేశ్వరరావు, మచ్చ వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు పి.సోమయ్య, అన్నారపు కనకయ్య, బండి రమేష్, మాచర్ల భారతి ఉగాది సరళ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మెరుగు సత్యనారాయణ, బొంతు రాంబాబు, ఎర్ర శ్రీనివాసరావు, దుగ్గి కృష్ణ, మాదినేని రమేష్ మూడు శోభన్, పిట్టల రవి, ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య, ఇల్లందు మున్సిపల్ మాజీ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వర్లు(డివి), సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు, డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లి బాబు, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ ముత్యాల సత్యనారాయణ, మాజీ ఎంపీపీ మాలోత్ శకుంతల, సీపిఎం మండల కార్యదర్శి కే నరేంద్ర, టిఆర్ఎస్ నాయకులు హనుమకొండ రమేష్, ఉన్న వీరేందర్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు భూక్య రంజిత్ కుమార్, మేదరి వీర ప్రతాప్(టోనీ), కారేపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు భీమవరపు శ్రీనివాసరావు, ప్రముఖ న్యాయవాది రమేష్ కుమార్ మక్కాడ్, కుంచారపు రవి పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరై నూతన జంటను ఆశీర్వదించారు.

# కరీంనగర్ రజక సంఘం అధ్యక్షుడికి రాజ్యాధికార సమరభేరి ఆహ్వానం



**కరీంనగర్. జూన్ 26పీపుల్స్ డైరీ :** తెలంగాణలో బహుజన వర్గాల రాజకీయ సాధికారత లక్ష్యంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో జులై 05న నిర్వహించనున్న "రాజ్యాధికార సమరభేరి" మహాసభకు కరీంనగర్ రజక సంఘం అధ్యక్షులు రాచకొండ నరేష్ ని కలిసి ఆహ్వాన పత్రికను తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ అఖిల్ పాషా అందజేశారు. ఈ సందర్భంగా అఖిల్ పాషా మాట్లాడుతూ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ బహుజన వర్గాలకు రాజకీయంగా సముచిత ప్రాధాన్యత కల్పించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న రాజ్యాధికార సమరభేరిని విజయవంతం చేయడానికి అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళ ఉపాధ్యక్షురాలు జింక లావణ్య, జిల్లా అధ్యక్షురాలు గంగిపెల్లి అరుణ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ చాంద్ పాషా, జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్, జిల్లా మహిళ అధ్యక్షురాలు అరుణ, టౌన్ ప్రెసిడెంట్ వేణు, మైనారిటీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అర్షత్ బిన్ అలీ, నాయకులు మహబూబ్ అలీ, సుద్దాల స్వరూప్, అనిల్, నరేష్, రాజు, మోహన్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల ప్రక్షాళన ప్రక్రియను పరిశీలించిన బీజేపీ నాయకులు



**హుజూరాబాద్, జూన్ 26, (పీపుల్స్ డైరీ) :** కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటర్ల ప్రక్షాళన (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని హుజూరాబాద్ పట్టణంలోని 34వ బూత్‌లో బీజేపీ నాయకులు పరిశీలించారు. బీఎల్ఓ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రక్షాళన ప్రక్రియను పరిశీలించిన నాయకులు, అర్హులైన ప్రతి ఒక్కరు తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని, ఓటరు వివరాల్లో ఏవైనా మార్పులు ఉంటే సకాలంలో సరిదిద్దుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హత కలిగిన పౌరుడు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని కోరారు. ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రత్యేక ఓటర్ల ప్రక్షాళన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, బూత్ స్థాయి కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## నాగం పేట లో భూలక్ష్మి మహాలక్ష్మి బొడ్రాయి ప్రతిష్ట.



**జమ్మికుంట. జూన్ 26పీపుల్స్ డైరీ :** జమ్మికుంట మండలం నాగంపేట గ్రామంలో యంత్ర స్థాపన విగ్రహ ప్రతిష్ట బొడ్రాయి భూలక్ష్మి మహాలక్ష్మి మాంకాలమ్మ మదనమ్మ దేవతల ప్రతిష్ట కార్యక్రమం పూర్తిగా శ్రీ కటుకూరి ఇందిరా నరసింహారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా రంగ రంగ వైభవంగా జరిగిందని గ్రామ ప్రజలు తెలిపినారు ఊరు దేవత బొడ్రాయి ప్రతిష్టాపన ఖర్చు స్వయంకృషితో పెట్టి నాగంపేట గ్రామం ప్రజల్లో వెలుగులు నింపిన కటుకూరి నరసింహారెడ్డి కి గ్రామస్తుడైన డాక్టర్ చిటికెన జగదీశ్వర్ శాలువాతో సన్మానం చేసి ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో చేయాలని అభినందించినారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి కప్పల పోచయ్య..ఉపసర్పంచి ఎంగల సుమలత లింగమూర్తి. వార్డు సభ్యులు పంజాల సదానందం.పంజాల సంతోష్. మాదూరి జగదీశ్వర్..గ్రామ ప్రజలు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## కంటి ఆరోగ్యమే జీవన నాణ్యతకు ఆధారం

**దండి లక్ష్మి-హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్**



**హుస్నాబాద్ టౌన్: (పీపుల్స్ డైరీ) జూన్ 26 :** హుస్నాబాద్ పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో 19వ వార్డు కౌన్సిలర్ బత్తుల స్వరూప రవీందర్ ఆధ్వర్యంలో, శరత్ మాక్స్ విజన్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సహకారంతో ఉచిత కంటి పరీక్షల శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కంటి ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ముఖ్యంగా 50 సంవత్సరాలు దాటిన వారు ఏడాదికి కనీసం ఒక్కసారైనా కంటి పరీక్షలు చేయించుకోవడం ద్వారా శుక్లాలు, గ్లాకోమా, మధుమేహం వల్ల వచ్చే కంటి సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స పొందవచ్చని తెలిపారు. కంటి చూపులో మార్పులు, మసకగా కనిపించడం, నొప్పి లేదా ఎర్రబడటం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. సమతుల్య ఆహారం తీసుకోవడం, పచ్చని ఆకుకూరలు, విటమిన్-ఏ అధికంగా ఉండే ఆహారం తీసుకోవడం, కళ్లకు విశ్రాంతి ఇవ్వడం, అవసరమైనప్పుడు రక్షణ కళ్లజోడు వినియోగించడం వంటి జాగ్రత్తలు పాటించాలని అన్నారు. ఈ శిబిరంలో సుమారు 60 మందికి పైగా కంటి పరీక్షలు నిర్వహించగా, అవసరమైన వారికి శుక్లాల శస్త్రచికిత్స కోసం సలహాలు అందించినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ రవీందర్, మున్సిపల్ కౌన్సిలర్లు పూదరి వరప్రసాద్, కేశవేణి రమేష్, పిల్లి తిరుపతి, హుస్నాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెన్న రాజు, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెల్దండి వెంకటరమణ, నాయకులు బూరుగు కృష్ణస్వామి, గట్టు రాములు, బత్తుల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘన్ముక్ల లో శ్రీ శివపార్వతుల కళ్యాణ మహోత్సవం



**వీణవంక జూన్ 26( పీపుల్స్ డైరీ) :** ఘన్ముక్ల గ్రామం లో శ్రీ శివ పార్వతుల కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా వేదమంత్రోత్సవాల నడుమ జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్ శివ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకకు గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.శివపార్వతుల కళ్యాణాన్ని కనులారా తిలకించారు. కళ్యాణోత్సవం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం నిర్వహించారు. సాయంత్రం దేవతామూర్తులను గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు చేశారు.

## భక్తి శ్రద్దలతో మెహరం వేడుకలు



**వీణవంక జూన్ 26( పీపుల్స్ డైరీ) :** మండలం లోని పలు గ్రామాలలో గురువారం రోజు రాత్రి మొహరం పండగ ఘన ంగా నిర్వహించడం జరిగి ంది. ఈ వేడుకలు మండలం లోని నర్సింగాపూర్ గ్రామం లో వేడుకల (పీర్ల )ను అత్యంత భక్తి శ్రద్ద లతో ప్రతి ఏటా కులమతాలకు అతీతంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మట్టి తో తయారు చేసిన కొత్త కుండలో బెల్లం పానకం తో తయారు చేసిన షర్బత్ మటికీలను, మలీన ముద్దలు తయారు చేసుకొని ఊరేగింపు గా సాయంత్రం డప్పు చప్పుల తో భక్తులు గ్రామం లోని పీర్ల చావడి వద్ద ఉన్న పీర్ల వద్దకు చేరికొని అక్కడ ఏర్పాటు చేసిన అగ్ని గుండం చుట్టూ తిరిగి, పీర్ల వద్ద మటికీలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మరి కొందరు తమ కోరికలు నెరవేరాలని పీర్లకు దట్టీ లను కట్టారు. పీర్లను పూజిస్తే కోరికలు నీరువేరుతాయని భక్తుల నమ్మకం.ఈ కార్యక్రమంలో మస్జీద్ కమిటీ సభ్యులు, కులమతాలకు అతీతంగా గ్రామస్థులు పాల్గొన్నారు.

# కార్తెలు పోయే.. కాలం కాదయే..వర్షం కోసం అన్నదాతః ఎదురుచూపు

**రేగొండ జూన్ 26 పీపుల్స్ డైరీ :** మృగశిర కార్తె ఆరంభంలోనే కురిసే ఒకటిరెండు వానలతో పత్తి విత్తనాలు విత్తుకొని రైతులు సాగు పనులకు శ్రీకారం చుడతారు. మృగశిర పోయి ఆరుద్ర కార్తె వచ్చి మూడు రోజులు గడిచినా వర్షాల జాడలేదు. రుతుపవనాలు రాష్ట్రమంతా విస్తరించాయని, ఈవారం విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ ప్రకటించింది. జిల్లాలో ఎక్కడో ఒక చోట ఒకటిరెండు మిల్లీమీటర్ల వర్షం తప్ప సాగుకు అవసరమయ్యే వర్షాలు పడకపోవడంతో పత్తి విత్తనాలు వేసే పరిస్థితి లేదు. ప్రతియేటా జూన్ నెలాఖరు వరకు ఒకవైపు విత్తనాలు వేయడం పూర్తయ్యేది. 50 శాతం విత్తనాలు మొలకెత్తే పరిస్థితి ఉండేది. ఈ సంవత్సరం అందుకు భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. జూలై 10వరకు వర్షాలు పడి విత్తనాలు వేయడం పూర్తికాని పక్షంలో కాలం ఎత్తిపోయే అవకాశముంది. ఇదే జరిగితే పత్తిసాగుస్థానే ప్రత్యామ్నాయ సాగు చేపట్టవలసి వస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### రేగొండలో రెండో ప్రధాన పంట

జిల్లాలో వరి తర్వాత వర్షాకాలం పత్తి మిర్చీ ప్రధాన పంటగా సాగు చేస్తారు. యాసంగిలో మొక్కజొన్న, పత్తి స్థానంలో సాగవుతుంది. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో వర్షాకాలం పత్తి సాగు చేసి దానిని తీసిన తర్వాత మొక్కజొన్న సాగు చేస్తారు. జూన్ మొదటిరెండు వారాల్లో పత్తి విత్తనాలు పడితేనే ఆ తర్వాత మొక్కజొన్న సాగుకు వీలవుతుంది. ప్రస్తుతం జూలై 15 వరకు కూడా పత్తి విత్తనాలు పడతాయో లేదో అన్నది ప్రశ్నార్థకంగా



మారడంతో రెండుపంటలు తీసే రైతులు మక్కసాగుపై ఆశలు వదులుకుంటున్నారు. జిల్లాలో సాధారణ పత్తి సాగు విస్తీర్ణం 48 వేల నుంచి 54 వేల ఎకరాల వరకు ఉంటుంది. పత్తి విత్తనాలు వేయడానికి ఎదైనా ఒక ప్రాంతంలో కనీసం 60 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైతేనే భూమి పదనుకు వచ్చి విత్తనాలు మొలకెత్తే అవకాశముంటుంది. ప్రస్తుతం నైరుతి రుతు పవనాలు వచ్చిన తర్వాత జిల్లాలోని ఆయా మండలాల్లో వర్షాలు కురిసి సగటు వర్షపాతం 6 సెంటీమీటర్లు కూడా నమోదు కాలేదు. దీంతో పత్తి విత్తనాలు వేయలేక పోయారు. మృగశిర కార్తెలో కొందరు అడపాదడపా కురిసిన చిరుజల్లులకు విత్తనాలు వేశారు. ఆ విత్తనాలు ఇప్పుడు మొలకెత్తకుండా డబ్బులు వృథా అయిపోయాయి. ప్రస్తుత ఎల్‌నినో వాతావరణ పరిస్థితుల్లో మరో 15 రోజులు గడిచినా వర్షాలు పడకపోతే పత్తిసాగుపై ఆశలు వదలుకోవలసిందే.

### ఫత్తి విత్తనాలు కొనేవారే లేరు

ఈసీజన్‌లో పత్తి సాధారణ సాగు విస్తీర్ణం కాగా 48వేల ఎకరాలలో పత్తి సాగు చేస్తారని వ్యవసాయశాఖ అంచనా వేసింది. గత వానా కాలంలో 46,348 ఎకరాల్లో సాగుకావడంతో ఈ అంచనాకు వచ్చింది. ఈ విస్తీర్ణంలో సాగు కోసం 450 గ్రాముల విత్తనాల ప్యాకెట్లు 1,20,000 అవసరమవుతాయని వ్యవసాయశాఖ భావించింది. ఆ మేరకు విత్తన వ్యాపారులు విత్తనాలను అందుబాటులో ఉంచారు. వర్షాభావపరిస్థితుల నేపథ్యంలో ఇప్పటి వరకు 10 నుంచి 15శాతం విత్తనాలు మాత్రమే అమ్ముడైనట్లు వారు తెలిపారు.

### ప్రత్యామ్నాయ సాగు కూడా అనుమానమే..

వర్షాలు ఆలస్యమైతే మండలంలో పతి సాగుకు బదులుగా కందులు, పెసర, బబ్బెర్ల సాగుకు మారాలని వ్యవసాయశాఖ సూచిస్తున్నది. ఈ మేరకు విత్తనాలను అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించింది. వర్షాలు కురిసి సాగు పూర్తిగా జరిగితేనే తప్ప ప్రత్యామ్నాయ సాగుతో ఫలితమేమి పెద్దగా ఉండదని రైతులు అంటున్నారు.

# మాజీ సర్పంచ్ కుటుంభాన్ని మంత్రి పొన్నం ఆదుకోవాలి

- **బహుజన సమాజ్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి, పచ్చిమట్ల రవీందర్ గౌడ్**

**హుస్నాబాద్, జూన్ 26, (పీపుల్స్ డైరీ ):** హుస్నాబాద్ మండలం మహమ్మదాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ పిట్టల సంపత్ ఇటీవల 3, రోజుల క్రితం ఆత్మహత్యకు పాల్పడడం జరిగింది. ఆయన ఆత్మహత్యకు ప్రధాన కారణం స్థానిక గ్రామపంచాయతీ నుండి తను చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి 12, లక్షల రూపాయల బిల్లులు రాకపోవడం, కార్యదర్శి సర్పంచ్, ఉప సర్పంచ్, కొంతమంది వార్డ్ సభ్యులు జాప్యం చేయడం, అభివృద్ధి పనుల కొరకు తను చేసిన అప్పులు,, మిత్తి పెరిగిపోవడం దీనితో మనస్థాపం చెంది ఉరి వేసుకుని చనిపోవడం జరిగింది. మూడు రోజులు గడిచిన ఇప్పటికి స్థానిక ఎమ్మెల్యే,,మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, కనీసం ఫోన్ చేసి పరామర్శించకపోవడం చాలా బాధాకరమని బీఎస్పీ పార్టీ ఆవేదన వ్యక్తం చేయడం జరిగింది. ప్రజాస్వామ్యంలో అనేక పార్టీలు ఉంటాయి. కానీ కక్ష సాధింపు ధోరణి వైఖరి మంచి పద్ధతి కాదని బిఎస్పి పార్టీ పక్షాన తెలియజేయడం జరుగుతుంది. గత బి ఆర్ఎస్ పార్టీ హయాంలో అప్పటి సర్పంచుల మేడ మీద కత్తి పెట్టి అభివృద్ధి పనులు చేయించడం జరిగింది. ఆ బిల్లులను కేసీఆర్ ప్రభుత్వం మన చెల్లించలేదు. ఇట్టి బిల్లుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా పలుసార్లు చలో అసెంబ్లీ కార్యక్రమం లు చేపట్టిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం స్పందించిన దాఖలు లేవు. ఇట్టి 540 కోట్ల పెండింగ్ బిల్లుల విషయంలో సర్పంచుల ఫోరం హైకోర్టులో కూడా పిటిషన్ వేయడం జరిగింది.. ఇట్టి విషయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ యుద్ధ ప్రాతిపదికన ఆదుకోవాలని బిఎస్ పి పార్టీ పక్షాన డిమాండ్ చేయడం జరుగుతుంది.



వారి కుటుంబంకు బిఎస్పి పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని ఈ సందర్భంగా తెలియజేయడం జరిగింది.. కార్యక్రమంలో బిఎస్పి పార్టీ నియోజకవర్గ అధ్యక్షులు వెలుపల రాజు, జిల్లా మాజీ కార్యదర్శి ఎలుగందుల శంకర్, మొగిలి పాక శ్రీనివాస్, వారి కుటుంబ సభ్యులు ఉన్నారు.

# ప్రభుత్వ బడుల పరిరక్షణ పూర్తి బాధ్యత ప్రభుత్వానిదే

**బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు మహేందర్**

**హుజూరాబాద్, జూన్ 26, (పీపుల్స్ డైరీ) :** పేద, బహుజన వర్గాల పిల్లలకు విద్యను అందించే ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేసే ప్రయత్నాలను బహుజన్ సమాజ్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని బీఎస్పీ హుజూరాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు మహేందర్ జీ అన్నారు.ఆయన మాట్లాడుతూ, రాజ్యాంగం కల్పించిన హక్కు ప్రకారం 6 నుంచి 14 సంవత్సరాల పిల్లలకు ఉచిత, నిర్బంధ విద్యను అందించడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత అని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలను నిర్లక్ష్యం చేస్తూ, కార్పొరేట్ విద్యా సంస్థలకు ప్రాధాన్యం ఇవ్వడం రాజ్యాంగ విరుద్ధమని విమర్శించారు."విద్య వ్యాపారం కాదు.. అది పేదోడి హక్కు" అని పేర్కొన్న ఆయన, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాల్సిన పూర్తి బాధ్యత ప్రభుత్వానిదేనని అన్నారు. హుజూరాబాద్ నియోజక వర్గంలోని కొన్ని ప్రైవేట్ పాఠశాలలు పరిమితికి మించి విద్యార్థులను చేర్చుకుని వ్యాపార ధోరణితో వ్యవహరిస్తున్నాయని



ఆరోపించారు. విద్యా హక్కు చట్టం ప్రకారం ఒక ఉపాధ్యాయునికి 30 మంది విద్యార్థులు, ఒక తరగతి గదిలో 40 మందికి మించకుండా ఉండాలని పేర్కొన్నారు. అయితే, కొన్ని పాఠశాలల్లో ఒకే గదిలో 70 నుంచి 100 మంది వరకు విద్యార్థులను కూర్చోబెట్టి బోధన కొనసాగిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడితే సహించబోమని హెచ్చరించారు.ప్రైవేట్ పాఠశాలల్లో భారీ ఫీజులు వసూలు చేస్తూ, తగిన మౌలిక వసతులు కల్పించడం లేదని ఆరోపించిన ఆయన, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సౌకర్యాలు లేని విద్యాసంస్థలపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### బీఎస్పీ ప్రధాన డిమాండ్లు:

మూతపడిన ప్రభుత్వ పాఠశాలలను వెంటనే తిరిగి ప్రారంభించాలి.ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాలి.ప్రైవేట్ పాఠశాలల్లో అనుమతించిన పరిమితికి మించి విద్యార్థులను చేర్చకుండా చర్యలు తీసుకోవాలి.ప్రభుత్వం ఈ సమస్యలపై స్పందించకపోతే బహుజన ప్రజల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని మహేందర్ జీ హెచ్చరించారు.

## నృత్య ప్రదర్శనలో ప్రథమ బహుమతి సాధించిన బిల్లా తన్వితకు ఘన సన్మానం



**హుజూరాబాద్, జూన్ 26, (పీపుల్స్ డైరీ) :** ఇటీవల రాజమండ్రిలోని ఎస్వీఎం కళాక్షేత్రంలో నిర్వహించిన కళా సమ్మేళనం-2026 నృత్య ప్రదర్శన పోటీలలో అద్భుత ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతి సాధించిన వంగర గ్రామానికి చెందిన హుజూరాబాద్ నివాసి బిల్లా తన్వితను హుజూరాబాద్ బీసీ జేఏసీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పట్టణంలోని పద్మాలయ క్లాత్ షోరూంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, ప్రముఖులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీసీ జేఏసీ గౌరవ అధ్యక్షులు చందుపట్ల జనార్ధన్ మాట్లాడుతూ, నాట్యాచార్యుడు వెంకటేశ్వర్లు శిక్షణలో తన్విత సాధించిన ఈ విజయం హుజూరాబాద్ ప్రాంతానికి గర్వకారణమన్నారు. తన అద్భుత నృత్య ప్రదర్శనతో ప్రథమ స్థానం సాధించిన బిల్లా తన్వితను అభినందిస్తూ, భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.అలాగే కళారంగంతో పాటు విద్యారంగంలోనూ రాణించి ఉన్నత స్థానాలను అధిరోహించి తల్లిదండ్రులకు, ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ అధ్యక్షులు సందేల వెంకన్న, ప్రధాన కార్యదర్శి చిలుకమారి శ్రీనివాస్, ఇప్పకాయల సాగర్, పల్లె ప్రశాంత్, తాటిపాముల కనకయ్య, దేవసాని ప్రియదర్శిని, మంద బిక్షపతి, దొంత హరికిషన్, మంచికట్ల విజయ్‌కుమార్, గాజర్ల బుచ్చిరాజం, మావునూరి ప్రవీణ్‌కుమార్, కొలిపాక క్రాంతి, జీవన్‌కుమార్, పోగు సమ్మయ్య, రజినీకాంత్ తదితరులు పాల్గొని తన్వితకు, ఆమె కుటుంబ సభ్యులకు అభినందనలు తెలిపారు.

## డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో విద్యార్థులు భాగస్వామ్యం కావాలి

**మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్**



**ఎల్కతుర్తి జూన్ 26 (పీపుల్స్ డైరీ) :** ఎల్కతుర్తి మండల కేంద్రంలో శుక్రవారం అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ఆదేశాలు మేరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తా నుంచి పోలీస్ స్టేషన్ వరకు చేపట్టిన ఈ ర్యాలీలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా అప్రమత్తంగా ఉండాలని అన్నారు. డ్రగ్స్ సమాజానికి, ముఖ్యంగా యువత భవిష్యత్తుకు పెను ముప్పుగా మారుతున్నాయని, గ్రామాలు, మండలాలు డ్రగ్స్ రహితంగా ఉండేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. "డ్రగ్స్‌ను నిర్మూలిద్దాం, యువత భవిష్యత్తును కాపాడుకుందాం" అనే నినాదంతో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు సీలం అనిల్ కుమార్, ఎంసీ డైరెక్టర్లు గౌడిశాల రాజయ్య, బచ్చు బాపురావు, అంబాల శ్రీకాంత్, మాజీ సర్పంచ్ యాదగిరి గౌడ్, సీనియర్ నాయకులు బొల్లెపోగు రమేష గౌడిశాల అర్జున్ మండలంలోని కాంగ్రెస్ సర్పంచులు,పుల్లూరి శ్రీ దర్ రావు సంతృప్తిని రవింధర్ గౌడ్ వార్డు సభ్యులు, గ్రామ శాఖ అధ్యక్షులు, బచ్చు శ్రీ దర్ రావు కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ కార్యక్రమంలో ఇంటింటికి ఓటరు నమోదు ఫారాల పంపిణీ

- మల్లన్నపల్లిలో ఓటరు నమోదు మహాయజ్ఞం
- 18 ఏళ్లు నిండిన ప్రతి యువకుడు ఓటరుగా నమోదు కావాలి -బీఎల్ఓ కలాలి స్వప్న
- ప్రజాస్వామ్య బలోపేతానికి ప్రతి ఓటు అమూల్యం-సర్పంచ్ పసునూటి శ్రీనివాస్



**ఇల్లంతకుంట, జూన్ 26 పీపుల్స్ డైరీ.** ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కే మూలస్తంభమని, ప్రతి అర్హుడైన పౌరుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు కావాలని మల్లన్నపల్లి గ్రామ సర్పంచ్ పసునూటి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలం మల్లన్నపల్లి గ్రామంలోని 214వ బూత్ పరిధిలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఓటరు నమోదు ఫారాల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, యువత, మహిళలు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొని ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన పొందారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపడుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమంలో కొత్త ఓటర్ల నమోదు, మరణించిన వారి పేర్ల తొలగింపు, చిరునామా మార్పులు, ఇతర సవరణలు చేపడుతున్నట్లు నిర్వాహకులు వివరించారు. గ్రామ సర్పంచ్ పసునూటి శ్రీనివాస్ మాట్లాడుతూ, 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువకుడు, యువతి ఓటరుగా నమోదు కావాలని కోరారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత శక్తివంతమైన ఆయుధమని, గ్రామంలో ఒక్క అర్హుడైనా ఓటరు జాబితాకు దూరం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బూత్ లెవల్ ఆఫీసర్ (బీఎల్ఓ) కలాలి స్వప్న మాట్లాడుతూ, ఫారం-6 ద్వారా కొత్త ఓటర్ల నమోదు, ఫారం-8 ద్వారా సవరణలు, ఇతర అవసరమైన మార్పులు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. ప్రజలు సరైన ఆధార పత్రాలతో ముందుకు వచ్చి నమోదు ప్రక్రియను సులభతరం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతి నిధులు, నాయకులు ఇంటింటికి వెళ్లి ఓటరు నమోదు ఫారాలను పంపిణీ చేశారు. గ్రామంలో ఎన్నికల అవగాహన పెంపొం దించేందుకు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు కూడా నిర్వహిం చనున్నట్లు తెలిపారు. ఓటరు జాబితా స్వచ్ఛత, పారదర్శకత కోసం ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గంధం రవీందర్, తోటరాజు, వేముల ప్రవీణ్ రెడ్డి, పంతాటి శంకర్, వేముల హనుమయ్య, ఎడ్ల తిరుపతి, ఆకుల రాము తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు ఉత్సాహంగా స్పందిస్తూ ఓటరు నమోదు ప్రక్రియలో భాగస్వాములు కావాలని నిర్వాహకులు కోరారు.

# తహసీల్దార్ కార్యాలయ నిర్లక్ష్యంపై బాధితురాలును పరామర్శించిన బీఎస్పీ నాయకులు



**హుజూరాబాద్, జూన్ 26, (పీపుల్స్ డైరీ) :** తహసీల్దార్ కార్యాలయ నిర్లక్ష్యం కారణంగా తీవ్ర మనస్తాపానికి గురైన బాధితురాలు దుకురే పద్మను, ఆమె కుమారుడు రాజ్ కమల్ను బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు పరామర్శించారు. హుజూరాబాద్ నియోజకవర్గ బీఎస్పీ అధ్యక్షుడు మహేందర్ జీ (జూపాక ఉప సర్పంచ్) ఆధ్వర్యంలో జోన్ ఇన్‌చార్జి పల్లె ప్రశాంత్ గౌడ్ (ఎంఏ, ఎల్ఎల్‌బీ), అసెంబ్లీ ఇన్‌చార్జి అంబాల ప్రభాకర్, సీనియర్ నాయకులు మారపెల్లి మొగిలయ్య, గిరవేణి శ్రీకాంత్, సందేల వెంకన్న, మామిండ్ల మల్లయ్య, జాజుల శ్రీనివాస్ తదితరులు బాధిత కుటుంబాన్ని కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా పల్లె ప్రశాంత్ గౌడ్ మాట్లాడుతూ, ప్రజలు భూమి పట్టాలు, కుల, ఆదాయ ధృవపత్రాల కోసం ఎమ్మార్వో కార్యాలయాల చుట్టూ రోజుల తరబడి తిరగాల్సిన పరిస్థితి నెలకొందని అన్నారు. హుజూరాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో పేదల ఫైళ్లు కదలాలంటే లంచాలు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు రావడం ఆందో ళనకరమని పేర్కొన్నారు. ప్రజాసేవకులు రాజ్యాంగబద్ధంగా విధులు నిర్వర్తించాల్సిన బాధ్యత ఉందని, లంచాలు డిమాండ్ చేయడం, పనులను ఆలస్యం చేయడం చట్టవిరుద్ధమని అన్నారు. ప్రజలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### బీఎస్పీ ప్రధాన డిమాండ్లు బాధితురాలు

పద్మ వైద్య ఖర్చులను ప్రభుత్వం పూర్తిగా భరించాలి. ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి. అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) విచారణకు ఆదేశించాలి. తహసీల్దార్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న పేదల ఫైళ్లను 15 రోజుల్లో పరిష్కరించాలి. ప్రతి మండల కార్యాలయంలో "లంచం ఇవ్వడం, తీసుకోవడం నేరం" అనే బోర్డులతో పాటు ఫిర్యాదు నంబర్‌ను ఏర్పాటు చేయాలి. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు బహుజన్ సమాజ్ పార్టీ చట్టపరంగా, ప్రజా పోరాటాల ద్వారా అండగా ఉంటుందని నాయకులు స్పష్టం చేశారు.

# సర్పంచ్ ల పెండింగ్ బిల్లులు ఇప్పించి ఆదుకోవాలి

- మాజీ సర్పంచ్ పిట్టల సంపత్ కుటుంబాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ పరామర్శించాలి
- బి ఆర్ ఎస్ పార్టీ హుస్నాబాద్ నియోజకవర్గ నాయకులు అయిలేని మల్లికార్జున రెడ్డి....

**హుస్నాబాద్, జూన్ 26, (పీపుల్స్ డైరీ ) :** కాంగ్రెస్ పార్టీ నాయకులు బి ఆర్ ఎస్ పార్టీ పై విమర్శలు మానుకొని గతం లో గ్రామ అభివృద్ధి కోసం చేసిన పనులకు పెండింగ్ లో ఉన్న బిల్లులు చెల్లించి సర్పంచ్ లను ఆదుకోవాలని కోరుతున్నాం కాంగ్రెస్ పార్టీ ని నమ్మి ప్రజలు ఓట్లు వేసి అధికారం లో కూర్చుశీ డ పెట్టినారు ప్రజల నమ్మకన్ని ఉండే విధంగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పనిచేయాలి కానీ బి ఆర్ ఎస్ పార్టీ అధికారం లో ఉన్నప్పుడు గ్రామాల లో ఎక్కువ శాతం బి ఆర్ ఎస్ పార్టీ కీ చెందిన సర్పంచ్ లే గెలిచినారు బి ఆర్ ఎస్ పార్టీ ప్రభుత్వం అధికారం కోల్పోయిన తరువాత గ్రామ అభివృద్ధి కోసం చేసిన పనుల్లో సర్పంచ్ ల పెండింగ్ బిల్లులు ఉంటే ఉండవచ్చు కానీ కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వచ్చిన తరువాత సర్పంచ్ లు చేసిన పనులుకు పెండింగ్ బిల్లులు చెల్లించడం లేదు అని ప్రశ్నినిస్తున్నాం సర్పంచ్ ల పదవి కాలం లో గ్రామ అభివృద్ధి చేయాలానే తపన తో అప్పులు తీసుక వచ్చి అయినా గ్రామ అభివృద్ధి కోసం పనులు చేసినారు చేసిన పనులకు పెండింగ్ బిల్లులు రాకపోవడం తో అనేక మంది సర్పంచ్ లు తెచ్చిన అప్పులు కట్టలేక ఆవేదనకు గురివుతున్నారు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తరువాత పెద్ద పెద్ద కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లులు చెల్లించా లేదా అని ప్రశ్నినిస్తున్నాం కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వచ్చినప్పటి నుశీడి సర్పంచ్ లు మేము గ్రామ అభివృద్ధి కోసం చేసిన పనుల పెండింగ్ బిల్లులు ఉన్నాయి వాటిని చెల్లించాలని అనేక సార్లు ప్రభుత్వం దృష్టికీ తీసుక వెళ్ళినారు అయినా ప్రభుత్వం పట్టించుకోలేదు గతం లో ఎక్కువ మంది సర్పంచ్ లు బి ఆర్ ఎస్ పార్టీ వల్లే ఉన్నారు కాబట్టి వారి పై కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కక్ష గట్టినట్లు వ్యవరిస్తునట్లు కనబడుతుంది కనీసం ఇప్పటికైన కాంగ్రెస్ ప్రభుత్వం సర్పంచ్ ల అవేధలను పట్టించుకోని పెండింగ్ బిల్లులు చెల్లించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలు నమ్మి మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్ ని అధికార పీఠం పై కూర్చుశీడ పెట్టుతే అధికారంలోకి వచ్చిన తరువాత నియోజకవర్గ ప్రజల కష్టాలను పట్టించుకోవడం కోసం సమయం ఇచ్చే పరిస్థితి లేకుండా పోయినట్టు కనబడు తుంది అధికారం లో ఉన్న ప్రజాప్రతినిధులే నియోజకవర్గ ప్రజలు పట్టుంచుకోకపోతే కష్టాలో ఉన్న ప్రజలకు ఎవరు భరోసా ఇస్తా రు అని ప్రశ్నినిస్తున్నాం అధికారం లో ఉన్న మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్ నమ్మి ఓట్లు వేసి గెలిపించిన నియోజకవర్గ ప్రజలన్ని 24గంటలు గుండెల్లో పెట్టుకోని చూసుకోని ప్రజల కోసం ఆలోచించాలి నియోజకవర్గం లో పార్టీల అతీతం గా ప్రతి ఇంటి కష్టసుఖాలకు అండగా ఉండి భరోసా ఇవ్వాలని



కోరుతున్నాం రాజకీయలలో అధికారం ఎవరికీ ఎప్పుడు శ్వాశీతం కాదు గత నాలుగు రోజుల క్రితం అప్పుల బాధ తో ఆత్మ హత్య చేసుకున్న మహమ్మదపూర్ గ్రామ మాజీ సర్పంచ్ పిట్టల సంపత్ కుటుంబాన్ని ఇప్పటి వరకు పరామర్శించకపోవడం చాలా బాధకారం అని తెలుపుతున్నాం కనీసం ఇప్పటికై మంత్రి వర్యులు సమయం ఇచ్చి మృతి చెందిన పిట్టల సంపత్ కుటుంబాన్ని పరామర్శించాలని కోరుతున్నా

# డ్రగ్స్ రహిత తెలంగాణే ప్రజాపాలన ప్రభుత్వ లక్ష్యం

- డ్రగ్స్ రహిత హుస్నాబాద్.
- వెల్దండి వెంకటరమణ-హుస్నాబాద్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు

**హుస్నాబాద్, టౌన్: (పీపుల్స్ డైరీ) జూన్ 26 :** అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా హుస్నాబాద్ పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వెల్దండి వెంకటరమణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్ వినియోగం వ్యక్తిగత జీవితాన్నే కాకుండా కుటుంబాలు, సమాజాన్ని కూడా తీవ్రంగా దెబ్బతీస్తుందని అన్నారు. డ్రగ్స్ నిర్మూలనలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, ప్రజాపాలన ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న "డ్రగ్స్ రహిత హుస్నాబాద్ -- డ్రగ్స్ రహిత తెలంగాణ" సాధనకు ప్రజలంతా సహకరించాలని పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు అవగాహన, అప్రమత్తత, సామాజిక భాగస్వామ్యం ఎంతో అవసరమని పేర్కొన్నారు. అనంతరం



డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేస్తామని అందరూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి, వైస్ చైర్మన్ చిత్తారి పద్మ రవీందర్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ కేడం లింగమూర్తి, మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు వెన్న రాజు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బంక చందు, మున్సిపల్ కౌన్సిలర్లు పూదరి వరప్రసాద్, కేశవేణి రమేష్, గోపగోని శోభన్ గౌడ్, వైద్యం కిరణ్ ప్రసాద్, పిల్లి తిరుపతి, బొలిశెట్టి రాజు, బత్తుల స్వరూప, కోఆప్షన్ సభ్యులు ఎండి. హసన్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు, పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కారేపల్లి మండలంలో మాజీ ఎమ్మెల్యే రాములు నాయక్ విస్తృత పర్యటన


### పలు కుటుంబాలకు పరామర్శ



**సింగరేణి (కారేపల్లి) జూన్ 26 (పీపుల్స్ డైరీ) :** మండలంలోని పలు గ్రామాల్లో వైరా మాజీ శాసనసభ్యులు లావుడియా రాములు నాయక్ శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. కారేపల్లి కీ చెందిన సీనియర్ జర్నలిస్ట్, సామజిక వేత్త ఇందుర్తి సురేందర్ రెడ్డి ఇటీవల ప్రమాదవసత్తు గాయపడి ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న వారి ఇంటికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు విశ్వనాథ్ పల్లి గ్రామానికి చెందిన ప్రముఖ మేస్త్రి వీరయ్య ఇటీవల మరణించడంతో వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం కారేపల్లికి చెందిన తలకలపల్లి శ్రీనివాస్ ఇటీవల గాయపడడంతో వారి ఇంటికి వెళ్లి పరామర్శించి ఓదార్చారు. భాగ్యనగర్ తండా డీబి సెంటర్ కు చెందిన సింగరేణి విశ్రాంత ఉద్యోగి జర్పుల చంద్రు భార్య అంకి ఇటీవల మరణించడంతో వారి కుటుంబ సభ్యులను, వారి కుమారులు వీరన్న, నాగేష్ లను పరామర్శించి సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైరా ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ ముత్యాల సత్యనారాయణ, మాజీ ప్రధాన కార్యదర్శి అజ్మీర వీరన్న, వార్డు సభ్యులు భూక్య కిషన్, గుగులోత్ నాగేశ్వరావు, జర్పుల సందీప్, అజ్మీర మమత, కాంతారావు, రాజేష్, నాయకులు వాంకుడోత్ నరేష్, భూక్య రాంకిషోర్, గడ్డం వెంకటేశ్వర్లు, జర్పుల ప్రసాద్, లావుడియా లచ్చు, అజ్మీరా శంకర్ మత్రు, బానోతు వెంకటియ, బానోత్ కోటి, గుగులోత్ హారు, వాంకుడోత్ విజయ్, గుగులోతు దళ్ సింగ్, నాయకులు భూక్య మోతిలాల్, కాకటి సాయి, జహిర్, అశోక్, భూక్య రాంకీ, చందావత్ నాగేష్, నాయవాది ధరవత్ చందు,తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ఓటర్లను తొలగించవద్దు

### అధికారులకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చాడ కొండాల్ రెడ్డి సూచన



**సైదాపూర్ జూన్ 26 ( పీపుల్స్ డైరీ ) :** గ్రామాల్లో జరుగుతున్న ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా సాగాలని కాంగ్రెస్ పార్టీ నూతన మండల అధ్యక్షుడు చాడ కొండాల్ రెడ్డి అన్నారు. మాజీ జడ్పీటీసీ గుండారపు శ్రీనివాస్‌తో కలిసి ఆయన శుక్రవారం వెంకటేశ్వర్లపల్లి గ్రామంలో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అర్హులైన ఓటర్ల పేర్లను ఎట్టి పరిస్థితుల్లోనూ జాబితా నుంచి తొలగించవద్దని అధికారులకు సూచించారు. కేవలం అనర్హులను మాత్రమే గుర్తించి తొలగించాలని స్పష్టం చేశారు. ఈ ప్రక్రియ సజావుగా సాగేందుకు, అధికారులకు పూర్తి స్థాయిలో సహకరించేలా పార్టీ పక్షాన ప్రత్యేకంగా కార్యకర్తలను ఎంపిక చేసినట్లు తెలిపారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నూతన మండల అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా వెంకటేశ్వర్లపల్లి గ్రామానికి విచ్చేసిన చాడ కొండాల్ రెడ్డికి పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయనను పార్టీ నాయకులు, కార్యకర్తలు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాయిశెట్టి చంద్రయ్య, వార్డు సభ్యులు, ఏఎంసీ డైరెక్టర్లు తాళ్ళపెల్లి వెంకటేశం, ఎర్రల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ వెంకటేశ్వర్లపల్లి గ్రామశాఖ అధ్యక్షుడు బాషవేణి సంపత్ తదితర నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతుల ముంగిటకే ఎరువులు

### ఘణపూర్, రాయికల్, శివరాంపల్లి గ్రామాల్లో విక్రయ కేంద్రాల ప్రారంభం




**సైదాపూర్ జూన్ 26 ( పీపుల్స్ డైరీ) :** రైతులు వ్యవసాయ పనుల సమయంలో ఎరువుల కోసం వ్యయప్రయాసలకోర్చి సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా ఉండేందుకే గ్రామాల్లో ఎరువుల విక్రయ కేంద్రాలను అందుబాటులోకి తెచ్చినట్లు ప్యాక్స్ పర్సన్ ఇన్చార్జి కొత్త తిరుపతిరెడ్డి పేర్కొన్నారు. వెన్కేపల్లి-సైదాపూర్ విశాల సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో రైతుల సౌకర్యార్థం మండలంలోని ఘణపూర్, రాయికల్, శివరాంపల్లి గ్రామాల్లో నూతన ఎరువుల కేంద్రాలను వారు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పంటల సీజన్ సమయంలో అన్నదాతలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నాణ్యమైన ఎరువులను సకాలంలో అందించడమే లక్ష్యంగా సొసైటీ పనిచేస్తోందన్నారు. స్థానికంగానే ఎరువులు లభిస్తుండటంతో రైతులకు రవాణా ఖర్చులతో పాటు సమయం ఆదా అవుతుందని తెలిపారు. సహకార సంఘం ద్వారా అందుబాటులోకి తెచ్చిన ఈ సేవలను ఆయా గ్రామాల రైతులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చాడ కొండాల్ రెడ్డి, స్థానిక సర్పంచాలు బాసరాజు రజిత, చాడ అఖిల, పోలు స్వరూప, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ న్యాదెండ్ల రాజ్‌కుమార్, సీనియర్ నాయకులు గుండారపు శ్రీనివాస్, ప్యాక్స్ సీఈఓ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్లకు ఎన్యుమరేషన్ పత్రాల పంపిణీ

## కీసర మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రామిడి విజయ్ రెడ్డి



**మేడ్చల్ కీసర, జూన్ 26 (పీపుల్స్ డైరీ) :** ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడైన పౌరుడి పేరు ఓటరు జాబితాలో సక్రమంగా నమోదై ఉండటం అత్యవసరమని పేర్కొంటూ, ఎంఎంసీ కీసర డివిజన్--1 పరిధిలోని తిమ్మాయిపల్లి గ్రామంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని ఓటర్లకు ఎన్యుమరేషన్ పత్రాలను ఇంటింటికీ వెళ్లి అందజేశారు. ఓటర్లు తమ వ్యక్తిగత వివరాలు, చిరునామా, కుటుంబ సభ్యుల వివరాలు తదితర అంశాలను పరిశీలించి, ఏవైనా పొరపాట్లు ఉంటే వాటిని సరిదిద్దుకునేలా అవగాహన కల్పించారు. కొత్తగా అర్హత పొందిన యువత ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలని, మ-రణించిన లేదా ఇతర ప్రాంతాలకు మారిన వారి వివరాలను కూడా సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఈ సందర్భంగా డివిజన్ నాయకులు రామిడి విజయ్ రెడ్డి, మాజీ బీఎల్ఏ సురేష్ గౌడ్, ఇలేష్ యాదవ్, బీఎల్ఓ వరలక్ష్మి పాల్గొని ఓటర్లకు ఎన్యుమరేషన్ పత్రాలను అందజేశారు. ప్రతి ఓటరు తన వివరాలను తప్పనిసరిగా ధృవీకరించి, నిర్ణీత గడువులోగా అవసరమైన మార్పులు, చేర్పులు పూర్తి చేయాలని వారు కోరారు. ఓటరు జాబితా పారదర్శకంగా, తప్పుల్లేకుండా ఉండేందుకు ప్రజల సహకారం ఎంతో అవసరమని, ప్రతి ఒక్కరూ ఎన్నికల సంఘం చేపడుతున్న ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని నాయకులు పిలుపునిచ్చారు. తిమ్మాయిపల్లి గ్రామంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజల నుంచి మంచి స్పందన లభించింది.

# యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

## మాదకద్రవ్యాల నిర్మూలనకు అందరి సహకారం అవసరం- ఎస్.సదానందం హుస్నాబాద్ ఏసిపి



**హుస్నాబాద్, టౌన్: (పీపుల్స్ డైరీ) జూన్ 26 :** అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో హుస్నాబాద్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హుస్నాబాద్ ఏసీపీ ఎస్. సదానందం నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, ఎస్సై లక్ష్మారెడ్డి పాల్గొని ప్రజలకు మాదకద్రవ్యాల వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసిపి ఎస్. సదానందం మాట్లాడుతూ యువత, విద్యార్థులు మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండి క్రమశిక్షణతో చదువుకొని తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని సూచించారు. డ్రగ్స్ వినియోగం వ్యక్తిగత జీవితానికే కాకుండా కుటుంబం, సమాజంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని అన్నారు. మాదకద్రవ్యాలకు సంబంధించిన అనుమానాస్పద కార్యకలాపాలు ఎక్కడైనా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించి సమాజాన్ని రక్షించడంలో భాగస్వాములు కావాలని ప్రజలను కోరారు. అనంతరం "డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరం కృషి చేస్తాం" అంటూ హాజరైన వారందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వెన్న రాజు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వి. వెంకట రమణ, ట్రాఫిక్ ఎస్సై వెంకటేశ్వర్లు, మున్సిపల్ కౌన్సిలర్లు, సివిల్, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది, పట్టణ ప్రముఖులు, యువకులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# యువత, డగ్స్ కు దూరంగా ఉండాలి

## ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్




**(పీపుల్స్ డైరీ) జూన్ 26 :** డ్రగ్స్ రహిత తెలంగాణ లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం పక్కా ప్రణాళిక ప్రకారం ముందుకు వెళుతుందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈగల్ ఫోర్స్ ఆద్వర్యంలో మాదక ద్రవ్యాలతో కలిగే నష్టాలపై జిల్లా వ్యాప్తంగా వివిధ విద్యాలయాల్లో వారం రోజులుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం, మాదక ద్రవ్యాల దుష్ప్రభావాల దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈగల్ ఫోర్స్ ఆద్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో కార్యక్రమాన్ని అంబేద్కర్ చౌరస్తా వద్ద శుక్రవారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు ఎస్పీ చంద్రయ్యతో కలిసి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ర్యాలీ అంబేద్కర్ చౌరస్తా నుంచి పద్మనాయక కల్యాణ మండపం వరకు నిర్వహించారు. అనంతరం మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలు, నష్టాలపై స్కూల్ విద్యార్థులు, సిరిసిల్ల నర్సింగ్ కళాశాల విద్యార్థుల ప్రదర్శనలు అందరినీ ఆలోచింపజేశాయి. డ్రగ్స్ కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. వివిధ స్టాళ్లను అతిథులు పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. పిల్లల భద్రత.. డ్రగ్స్ కు అడ్డుకట్ట సే నో టూ డ్రగ్స్.. సే ఎస్ టూ లైఫ్ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మాతృశ్రీ కళాశాలలో విద్యార్థులకు ఉచిత నైపుణ్య శిక్షణ



**హుజూరాబాద్, జూన్ 26 (పీపుల్స్ డైలీ):** హుజూరాబాద్ పట్టణంలోని మాతృశ్రీ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో విద్యార్థులకు రెగ్యులర్ విద్యతో పాటు ఉచిత నైపుణ్య శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు కళాశాల కరస్పాండెంట్, సెక్రటరీ కాయిత ఇంద్రసేనారెడ్డి తెలిపారు. శుక్రవారం కళాశాల అధ్యాపక బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇతర కళాశాలలు తప్పుడు ప్రచారాలు చేసినప్పటికీ విద్యార్థులు, తల్లిదండ్రులు తమ సంస్థపై ఉంచిన విశ్వాసానికి కృతజ్ఞతలు తెలిపారు. దోస్త్ మూడు విడతల కౌన్సెలింగ్ ద్వారా 2026--27 విద్యా సంవత్స రానికి అడ్మిషన్లు విజయవంతంగా పూర్తయ్యాయని వెల్లడించారు. విద్యార్థులకు కేవలం పాఠ్యపుస్తకాల జ్ఞానం మాత్రమే కాకుండా, భవిష్యత్తుకు అవసరమైన నైపుణ్యాలను అందించడమే మాతృశ్రీ కళాశాల ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

### విద్యార్థులకు అందించే ప్రత్యేక నైపుణ్య శిక్షణలు:

పబ్లిక్ స్పీకింగ్ నైపుణ్యాలు నాయకత్వ లక్షణాల అభివృద్ధి స్టడీ స్కిల్స్ కెరీర్ కౌన్సెలింగ్ సమయపాలన ఒత్తిడి నిర్వహణపై అవగాహన అదేవిధంగా, హనుమకొండకు చెందిన రోటరీ క్లబ్ సహకారంతో నిరుద్యోగ యువతకు ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా మూడు నెలలపాటు కళాశాల ప్రాంగణంలో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ అందించనున్నట్లు చెప్పారు. ఇందుకు తోడు ప్లాస్టిక్ ఉత్పత్తుల తయారీ, యంత్రాల నిర్వహణ వంటి అంశాల్లో కూడా శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు కాయిత ఇంద్రసేనారెడ్డి వెల్లడించారు. ఇంటర్మీడియట్ లేదా అంతకంటే ఎక్కువ చదివిన నిరుద్యోగ యువతి, యువకులు ఈ ఉచిత శిక్షణ కార్యక్రమాలకు అర్హులని కళాశాల యాజమాన్యం తెలిపింది. ఆసక్తి గల అభ్యర్థులు పూర్తి వివరాల కోసం హుజూరాబాద్‌లోని మాతృశ్రీ డిగ్రీ కళాశాల కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ వి. రామారావు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నరసింహారెడ్డితో పాటు అధ్యాపక బృందం పాల్గొన్నారు.

# రూపాయి బిళ్ల... రూపం చిన్నదైనా పాఠం పెద్దదే..

**పీపుల్స్ డైరీ, హైదరాబాద్ :** మానవ పరిణామ క్రమంలో ఆర్థిక వ్యవస్థను శాసించిన సాధనాల్లో 'నాణెం' అత్యంత ప్రాచీనమైనది. నాడు రాచరికపు ముద్రలతో చెలామణి అయిన సూర్యచంద్రుల లోహపు ముక్కలైనా... నేడు ఆధునిక సమాజంలో మన జేబుల్లో కిలకిలలాడే రూపాయి బిళ్లలైనా... నాణెం అనే వస్తువు మనిషి జీవన గమనంతో, సంస్కృతితో విడదీయరాని బంధాన్ని కలిగి ఉంది. అయితే, నిశితంగా పరిశీలిస్తే నాణెం కేవలం వస్తువులను కొనే ఒక జడ పదార్థం మాత్రమే కాదు, మానవ జీవితానికి, వ్యక్తిత్వ వికాసానికి అవసరమైన ఎన్నో అద్భుతమైన పరమార్థాలను నేర్పే ఒక నిశ్శబ్ద గురువు. దాని పుట్టుక నుండి ప్రయాణం వరకు ప్రతి అడుగూ ఒక స్ఫూర్తిదాయక పాఠమే.



### కఠిన పరీక్షే... ఉనికికి పునాది

ఒక సాధారణ లోహపు ముక్క నాణెంగా మారి సమాజంలో గుర్తింపు తెచ్చుకునే ప్రక్రియ అత్యంత కఠినమైనది. అది ల్యాబొరేటరీలోనో, ఫ్యాక్టరీలోనో తీవ్రమైన ఉష్ణోగ్రత కలిగిన కొలిమిలో కాలి, కరిగి, ఆ తర్వాత టన్నుల కొద్దీ ఒత్తిడిని కలిగించే యంత్రాల దెబ్బలకు ఎదురొడ్డి నిలబడాలి. దానిపై ఒక ముద్ర పడాలంటే ఆ లోహం అపారమైన వేదనను భరించాలి. అలా నిలిచినప్పుడే దానికి ఒక రూపం, ఒక విలువ లభిస్తాయి. మనిషి జీవితం కూడా ఇంతే. ఏ శ్రమ లేకుండా, సవాళ్లు ఎదుర్కోకుండా వచ్చే విజయం తాత్కాలికం. జీవితం మనల్ని కష్టాలనే కొలిమిలోకి నెట్టినప్పుడు, బాధ్యతలనే సుత్తె దెబ్బలు మనపై పడుతున్నప్పుడు కుంగిపోకూడదు. ఆ సవాళ్లన్నీ మనల్ని ఒక అద్భుతమైన శిల్పంగా మలచడానికి ప్రకృతి చేసే ప్రయత్నాలుగా భావించాలి. కఠినమైన పరిస్థితులను తట్టుకుని నిలబడినప్పుడే మనిషిలోని నిజమైన సామ-ర్థ్యం, పట్టుదల బయటపడి, సమాజంలో శాశ్వతమైన గుర్తింపు లభిస్తుంది.

### చేతులు మారినా... విలువ మారని నైజం

ఒక నాణెం ప్రయాణం ఎంతో వైవిధ్యమైనది, వర్ణనాతీతమైనది. అది ఒక రోజు కోటీశ్వరుడి ఏసీ గదిలోని విలాసవంతమైన లాకర్‌లో భద్రంగా ఉండవచ్చు, మరుసటి రోజే వీధి చివర ఆకలితో అలమటించే యాచకుడి మురికి చేతిలోకి చేరవచ్చు. అది ఒక పవిత్రమైన దేవాలయపు హుండీలో పడవచ్చు లేదా బురద కాలువలో దొర్లిపోవచ్చు. కానీ, ఎక్కడున్నా, ఎవరి చేతుల్లో ఉన్నా నాణెం తన అంతర్గత విలువను కోల్పోదు. బురదలో పడినా దాని విలువ రూపాయే, రాజప్రసాదంలో ఉన్నా దాని విలువ రూపాయే. మనుషులు కూడా జీవితంలో ఎటువంటి హెచ్చుతగ్గులు ఎదురైనా, ఎలాంటి విపత్కర పరిస్థితుల్లో జీవించాల్సి వచ్చినా తమ నైతిక విలువలను, ఆత్మగౌరవాన్ని వదులుకోకూడదు. సంపద, పదవులు ఉన్నప్పుడు అహంకారంతో పొంగిపోవడం, అవి లేనప్పుడు ఆత్మన్యూనతా భావంతో క్రుంగిపోవడం మనిషి బలహీనత. పరిస్థితులు ఎలా ఉన్నా, మన అంతర్గత గుణాన్ని, మంచితనాన్ని కాపాడుకుంటూ 'స్థితప్రజ్ఞత'తో జీవించాలనే పరమసత్యాన్ని నాణెం మనకు నిరూపించి చూపిస్తుంది.

### బొమ్మా-బొరుసు ఒకే నాణేనికి రెండు వైపులా...

జీవితంలో ఏదీ ఏకపక్షం కాదు. నాణేనికి బొమ్మ (Heads), బొరుసు (Tails) ఎలాగైతే రెండు వైపులా ఉండి తీరుతాయో, మానవ జీవితంలో కూడా సుఖం-దుఃఖం, గెలుపు-ఓటములు, ఆనందం-విషాదం అంతర్భాగంగా కలిసి ఉంటాయి. బొమ్మ లేకుండా బొరుసు లేదు, బొరుసు లేకుండా బొమ్మకు ఉనికి లేదు. నాణేన్ని గాల్లోకి ఎగరేసినప్పుడు ప్రతిసారీ బొమ్మే పడాలని కోరుకోవడం అత్యాశే అవుతుంది. ఈ రోజు మనం బొమ్మ వైపు చూస్తూ గెలుపు ఉత్సవాల్లో మునిగితేలుతూ ఉండవచ్చు, కానీ రేపు కాల చక్రం తిరిగి బొరుసు వైపు ఉన్న ఓటమిని, కష్టాన్ని చవిచూడాల్సి రావచ్చు. కాబట్టి, విజయం లభించినప్పుడు విర్రవీగకుండా, అపజయం ఎదురైనప్పుడు నిరాశతో ఆత్మహత్య సదృశ్య నిర్ణయాలు తీసుకోకుండా ముందుకు సాగాలి. రాత్రి తర్వాత పగలు రావడం ఎంత ప్రకృతి సహజమో, కష్టం తర్వాత సుఖం రావడం అంతటి నిశ్చయమైన సత్యం. ఈ రెండు వైపుల సమతుల్యతను అంగీకరించినప్పుడే జీవితం సగర్వంగా సాగుతుంది.

### అల్పమైనదేదీ లేదు... అసంపూర్ణాన్ని సంపూర్ణం చేస్తుంది

నేటి కార్పొరేట్ ప్రపంచంలో లక్షల కోట్లకు, మిలియన్ డాలర్లకు విలువ ఉండవచ్చు. కానీ, వందల కోట్ల రూపాయల సుదీర్ఘమైన లెక్కలోనైనా ఒక్క రూపాయి నాణెం తక్కువైతే ఆ లెక్క అసంపూర్ణమే అవుతుంది. కంప్యూటర్ స్క్రీన్‌పై ఆ ఒక్క రూపాయి తేడా వస్తే ఆడిటింగ్ పూర్తవ్వదు. సమాజంలో ఏ వ్యక్తి కూడా, ఏ వృత్తి కూడా తక్కువ కాదు. ప్రతి ఒక్కరికీ ఒక ప్రత్యేకమైన పాత్ర, ప్రాధాన్యత ఉంటాయి. రూపంలో చిన్నదైనంత మాత్రాన నాణెం తక్కువ కానట్లే, హోదాలో, ఆర్థిక స్థోమతలో చిన్నవారైనంత మాత్రాన ఏ మనిషీ సమాజానికి అనవసరం కాదు. పారిశుధ్య కార్మికుడి నుండి దేశ ప్రధాని వరకు ప్రతి ఒక్కరి శ్రమ ఈ దేశ నిర్మాణంలో భాగమే. ఎవరినీ తక్కువ చేసి చూడకూడదనే సమానత్వ భావనను, ప్రతి చిన్న విషయానికి ప్రాధాన్యత ఇవ్వాలనే సత్యాన్ని నాణెం మనకు గుర్తుచేస్తుంది.

### చిరిగిపోని నమ్మకం... చెదరని ఉనికి

ఆధునిక కాలంలో కాగితపు నోట్లు పెద్ద విలువను కలిగి ఉండవచ్చు, కానీ వాటికి మనుగడ తక్కువ. కాగితపు నోటు నీటిలో తడిస్తే చినిగిపోతుంది, నిప్పు తగిలితే బూడిదవుతుంది, ఎక్కువ కాలం వాడితే ముక్కలవుతుంది. కానీ నాణెం ఎండకు ఎండినా, వానకు తడిసినా, భూమి పొరల్లో వందల సంవత్సరాల పాటు పూడిపోయినా చెక్కుచెదరకుండా తన ఉనికిని కాపాడుకుంటుంది. అందుకే చరిత్రకారులు సైతం గత వైభవాన్ని, పురాతన నాగరికతల సత్యాలను తెలుసుకోవడానికి నాణేలనే ప్రాధాన్యత కలిగిన ఆధారాలుగా (Numismatics) స్వీకరిస్తారు. మన వ్యక్తిత్వం, మనం సంపాదించుకునే కీర్తి కూడా నాణెంలా దృఢంగా ఉండాలి. తాత్కాలిక ఆకర్షణలు, కాగితపు నోట్ల లాంటి శీఘ్ర కీర్తి కోసం ప్రాకులాడకుండా... కాలం మారినా, తరాలు మారినా చెరిగిపోని సత్ప్రవర్తనను, నమ్మకాన్ని మనం సంపాదించుకోవాలి. బాహ్య ప్రపంచం మనల్ని ఎంత ఒత్తిడికి గురిచేసినా, అంతర్గత ఆత్మవిశ్వాసం చెదరని రోజూ మనల్ని ఎవరూ ఓడించలేరు. జేబులో ఉన్న నాణెం కదిలినప్పుడు వచ్చే శబ్దం కేవలం లోహాల ఘ-ర్షణ కాదు... అది మన అంతరాత్మను మేల్కొలిపే హెచ్చరిక. కష్టాలను తట్టుకునే ధైర్యాన్ని, పరిస్థితులకు లొంగని నైజాన్ని, గెలుపోటములను సమానంగా స్వీకరించే విశాల హృదయాన్ని మనం అలవర్చుకోవాలి. నాణెం కేవలం ఆర్థిక లావాదేవీల కోసమే కాదు, జీవితాన్ని ఎలా గెలవాలో, సమాజంలో ఎలా నిలదొక్కుకోవాలో నేర్పే ఒక అద్భుతమైన దిక్సూచి. నాణెం లాంటి దృఢమైన, విలువైన వ్యక్తిత్వాన్ని నిర్మించుకుందాం, సమాజ ప్రగతిలో మనవంతు పాత్రను సగర్వంగా పోషిద్దాం...



**- కండె రమేష్ పీపుల్స్ డైరీ దినపత్రిక కరెస్పాండెంట్**

# లౌకిక స్ఫూర్తికి ప్రతీక మొహరం వేడుకలు

## పీర్ల జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే -గండ్ర సత్యనారాయణ రావు

**రేగొండ జూన్ 26 పీపుల్స్ డైరీ..** త్యాగానికి ప్రతిరూపం మొహర్రం (పీర్ల పండుగ ) భిన్న మతాల ఐకమత్యమే తెలంగాణ రాష్ట్ర సంస్కృతి సంప్రదాయాలకు నిదర్శనమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, తెలిపారు. శుక్రవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా గోరికొత్తపల్లి మండల కేంద్రంలో అత్యంత వైభంగా నిర్వహిస్తున్న మొహర్రం వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడు



తూ కుల మతల తేడా లేకుండా మత సామరస్యంతో జరుపుకునే పండుగనే మొహర్రమని అన్నారు. లౌకిక స్ఫూర్తికి ప్రతీకగా నిలిచే ఈ వేడుకల్లో భాగంగా శాంతి,



సామరస్యాలు వెల్లివిరియాలని ఆయన ఆకాంక్షిం చారు. అసైదుల హారతి కాళ్ళ గజ్జెల హిమ్మతి అంటూ తెలంగాణ సంస్కృతి గుర్తుతెచ్చే పండుగని భక్తిశ్రద్ధలతో అన్ని మతాల వారు కలిసికట్టుగా జరుపు కుంటారని తెలిపారు. రాచరిక వ్యవస్థ పునరుద్ధనంగా భావించిన మహ్మద్ ప్రవక్త మనువడు హోజ్రత్ ఇమామ్ హుస్సేన్ ప్రజల్ని చైతన్యవంతులను చేసి ప్రతిఘ టించడానికి సిద్ధపడ్డారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సూదన బోయిన. ఓంప్రకాష్, మటికే. సంతోష్,సాయిని. ముత్యం, పాతపల్లి. సంతోష్, వంచనగిరి. వీరేశం, చిగురుమామిడి. కుమా రస్వామి, సర్పంచ్ ల ఫోరమ్ మండల అధ్యక్షులు నాంద్రే. సునీత రవీందర్,ఓమాజీ, ప్రేమాజీ, వైనాల. ప్రభాకర్,ముస్లిం పెద్దలు యండి. షఫీమహ్మద్, ఎండీ. అబ్దుల్ రహీమ్, అజారుద్దీన్, సలీం, ఆచారవంతులు దాసరి. చిన్ని,చిలుక. కిరణ్, దాసరి. చిన్ని, శ్రీరామోజు. రాజు, నిమ్మల. రాజు చిలుకల. రాజు, పుల్యాల. యాకుబ్ తదితరులు పాల్గొన్నారు



## కార్మికుల కడుపు కొడితే ఏమి వస్తది?

### ఆజంజాహిమిల్లు భూముల వేలంపాటపై ఎర్రబెల్లి తీవ్ర ఆగ్రహం

**మట్టెవాడ, జూన్ 26 (పీపుల్స్ డైరీ):** వరంగల్ ఆజంజాహిమిల్లు భూముల ప్రభుత్వ వేలంపాటను వ్యతిరేకిస్తూ కార్మిక సంఘాలు చేస్తున్న ఆందోళనకు బీజేపీ రాష్ట్ర నాయకులు, వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు శుక్రవారం సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి ప్రదీప్ రావు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం దుర్మార్గం, రేవంత్ రెడ్డి వారి ప్రభుత్వం వచ్చిన తరువాత ఇదే కార్మికులకు ఇక్కడే భూమి ఇస్తానన్నది నిజం కాదా, 318 మంది కార్మికులకు మిల్లు స్థలంలోనే భూములు కేటాయించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. కానీ వేలంపాటల పేరుతో వారి హక్కులను కాలరాస్తోందని మండిపడ్డారు. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, స్థానిక మంత్రి కొండా సురేఖలు సమాధానం చెప్పాలి.. కార్మికుల కడుపు కొడితే ఏమి వస్తది? వారి కుటుంబాల భవిష్యత్తును నాశనం చేయడం మీ పాలన లక్షణమా? అంటూ తీవ్రంగా ప్రశ్నించారు. కార్మికుల హక్కుల కోసం పోరాటం కొనసాగుతుంది. అవసరమైతే మరింత తీవ్రంగా ఉద్యమిస్తాం అని ఎర్రబెల్లి ప్రదీప్ రావు స్పష్టం చేశారు.

## పాఠశాల తరలింపును వ్యతిరేకిస్తూ వంటా-వార్పు




**ఆత్మకూరు, జూన్ 26 (పీపుల్స్ డైరీ) :** ఆత్మకూరు మండలం నీరుకుళ్ల క్రాస్‌రోడ్డు వద్ద తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను గ్రామంలోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. నీరుకుళ్ల, పెంచికలపేట, కేశవాపూర్ గ్రామాల ప్రజలు, మహిళలు, యువకులు శుక్రవారం వంటా-వార్పు నిర్వహించి నిరసన తెలిపారు. పాఠశాలను పెద్దాపూర్‌కు తరలించే ప్రతిపాదనలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ "మా బడి మాకే కావాలి", "పిల్లల భవిష్యత్తుతో చెలగాటం ఆడొద్దు" అంటూ నినాదాలు చేశారు. పాఠశాల తరలింపును ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించబోమని స్పష్టం చేశారు. నిరసనకారులు జాతీయ రహదారిపై రాస్తారోకోకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేసి జాతీయ రహదారిపైకి ఎవరినీ వెళ్లనివ్వలేదు. గ్రామానికి మంజూరైన తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను నీరుకుళ్లలోనే కొనసాగించాలని, ప్రభుత్వం వెంటనే స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. డిమాండ్ నెరవేరే వరకు ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మూడు గ్రామాల ప్రజలు, జడ్పీహెచ్ఎస్ నీరుకుళ్ల పూర్వ విద్యార్థులు, మహిళలు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో అందరూ పాల్గొనాలి



**కేసముద్రం జూన్ 26 (పీపుల్స్ డైరీ) :** కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని అమీనాపురంలో భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి నిర్వహిస్తున్న ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం జూన్ 25 నుండి జూలై 24 వరకు కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో కేసముద్రం సింగిల్ విండో బ్యాంకు ఉపాధ్యక్షుడు, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి అంబటి మహేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో పార్టీలకతీతంగా అందరూ పాల్గొనాలని కోరారు. 5, 6 వార్డులలోని ఒక్క ఇల్లు కూడా తప్పిపోకుండా, ఓటు హక్కు కలిగి ఉన్న ప్రతి వ్యక్తి ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చూడాలని సూచించారు. 5వ వార్డు స్థాయి అధికారి సుధాకర్, 6వ వార్డు స్థాయి అధికారి ప్రశాంత్‌తో పాటు అన్ని పార్టీల ప్రతినిధులు పాల్గొని ప్రతి ఓటరుకు ఇంటింటి గణన పత్రం పంపిణీ చేస్తున్నారు. పత్రంలో సమగ్ర సమాచారాన్ని స్థాయి అధికారుల సహకారంతో నింపిన తర్వాత వాటిని తిరిగి వారే సేకరించి అంతర్జాలంలో నమోదు చేస్తారని తెలిపారు. జీవనోపాధి కోసం బయటికి వెళ్లిన వారు కూడా తప్పనిసరిగా ఈ పత్రం నింపాలని కోరారు.

## మోదీ 12 ఏళ్ల సుపరిపాలనను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



**గణపురం, జున్ 26 (పీపుల్స్ డైరీ) :** ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం 12 ఏళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు విస్తృతంగా వివరించాలని బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. విశేష జనసంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని శుక్రవారం గణపురం మండల కేంద్రంలో బీజేపీ మండల ఉపాధ్యక్షుడు మాదాసు మొగిలి గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల ఇంచార్జ్ జిల్లా కార్యదర్శి శివనాత్రి వేణు కిసాన్, మోర్చా జిల్లా అధ్యక్షులు పోలసాని తిరుపతి రావు హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గత 12 ఏళ్లలో దేశ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పలు చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుందని అన్నారు. పేదలు, రైతులు, మహిళలు, యువత సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని అనేక పథకాలను విజయవంతంగా అమలు చేసిందని పేర్కొన్నారు. ప్రభుత్వ విజయాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికీ చేరవేయడమే విశేష జనసంపర్క్ అభియాన్ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలతో కోట్లాది మంది లబ్ధి పొందారని అన్నారు. పార్టీ కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వ విజయాలను వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి దళిత మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దుప్పటి భద్రయ్య, బీజేవైఎం రాష్ట్ర నాయకులు మంద మహేష్, బిజెపి మండల ప్రధాన కార్యదర్శి చెలుమల్ల ప్రవీణ్, బిజెపి మండల నాయకులు సాంబశివుడు, గోరంటాల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్లో అండర్ డ్రైనేజీని సత్వరమే పూర్తి చేయాలి

### సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.నాగయ్య




**మట్టెవాడ, జూన్ 26 (పీపుల్స్ డైరీ):** వరంగల్ నగరాన్ని వరద ముంపు నుండి శాశ్వతంగా నివారించడానికి అండర్ డ్రైనేజీ ఏర్పాటు చేసి ముంపు లేని నగరంగా తీర్చిదిద్దుతామని సంవత్సరాల తరబడి ప్రభుత్వాలు వాగ్దానాలు ఇస్తున్నాయని ఇప్పటివరకు పూర్తి కాలేదని సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.నాగయ్య విమర్శించారు. సిపిఎం పార్టీ వరంగల్ జిల్లా కమిటీ సమావేశం ఉర్సుగుట్ట జిల్లా కార్యాలయంలో సింగారపు బాబు అధ్యక్షతన జరిగగింది. ఈ సందర్భంగా హాజరైన నాగయ్య మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం పూర్తి చేయలేకపోయిందని మేము వస్తే పూర్తి చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చి గెలిచిందన్నారు. రూ. 5,000 కోట్లు నిధులు కేటాయించినట్లు కావట్లేదని ప్రకటించారు కానీ ఇంతవరకు పని పూర్తి కాలేదని అన్నారు. కేటాయింపులు కాగితాలకే పరిమితమైనయని ఆచరణలో అమలు కావట్లేదని ఆయన అన్నారు. వర్షాలు పడితే మళ్లీ వరంగల్ నగరంలోని శివనగర్, మైసయ్య నగర్, ఆర్ఎస్ నగర్, లెనిన్ నగర్, రామన్నపేట, డీకే నగర్, మల్లు స్వరాజ్యం నగర్, రఘునాథ్ నగర్ తదితర ప్రాంతాలన్నీ నీట మునిగే ప్రమాదం ఉందని ప్రభుత్వం వెంటనే స్పందించి అండర్ డ్రైనేజీ వ్యవస్థని పూర్తి చేయాలని నాగయ్య కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వరంగల్ నగరాన్ని గుడిసెలు లేని నగరంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారని నగరంలోని గుడిసె సెంటర్లలో నివసిస్తున్న పేదలందరికీ పట్టాలు ఇచ్చి అక్కడే ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. గుడిసె ప్రాంతాలకు మౌలిక సౌకర్యాలు మంచినీరు, రోడ్లు, డ్రైనేజీ, కరెంటు, సమస్యలన్నీ తీర్చాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాల్సిన బాధ్యత ఉందని హామీల నుండి తప్పుకుంటే పేద ప్రజల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. గుడిసె వాసులకు పట్టాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం చేపట్టాలని 27వ తేదీ శనివారం ఏకశిలా పార్కు నుండి జిల్లా కలెక్టర్ ఆఫీస్ వరకు జరిగే ప్రదర్శనను జయప్రదం చేయాలని నాగయ్య పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి సిహెచ్.రంగయ్య, జిల్లా కమిటీ సభ్యులు ఈసంపల్లి బాబు, నలిగంటి రత్నమాల, భూక్య సమ్మయ్య, వలదాసు దుర్గయ్య, నమిండ్ల స్వామి, యారా ప్రశాంత్, బోళ్ల సాంబయ్య, ఆరూరి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గణపసముద్రం నీటి విడుదలపై రేపు రైతుల సమావేశం

**గణపురం, జున్ 26 (పీపుల్స్ డైరీ) :** గణపురం మండల కేంద్రంలోని గణప సముద్రం చెరువు ఆయకట్టు పరిధిలో వరి సాగుకు నీటి విడుదలపై చర్చించేందుకు ఈ నెల 28న ఆదివారం ఉదయం 10 గంటలకు రైతుల సమావేశం కానున్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో ఈ సమావేశం జరగనుంది. గణప సముద్రం చెరువు పరిధిలోని కోట కాలువ, ఊటు కాలువ, మత్తడి కాలువ, కొత్త కాలువల కింద సాగు చేసే రైతులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. రానున్న ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు కోసం కాలువల ద్వారా నీటి విడుదల, నార్లు పోసుకునే సమయం, సాగు ప్రణాళిక తదితర అంశాలపై సమావేశంలో చర్చించి నిర్ణయాలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఆయకట్టు పరిధిలోని రైతులందరూ సమావేశానికి హాజరై తమ అభిప్రాయాలు వెల్లడించాలని విజ్ఞప్తి చేశారు.

**కాలువల నీటి విడుదలపై నిర్ణయం తీసుకునే అవకాశం**

**ఖరీఫ్ సాగు ప్రణాళికపై కీలక నిర్ణయాలకు అవకాశం**

**రైతుల అభిప్రాయాలతో నీటి పంపిణీ కార్యాచరణ**

**చెరువు నీటి వినియోగంపై సమగ్ర చర్చకు ఏర్పాట్లు**

## పల్స్ పోలియో విజయవంతానికి పకడ్బందీ ఏర్పాట్లు

**ఐదేళ్లలోపు చిన్నారులందరికీ పల్స్ పోలియో చుక్కలు వేయించాలి**

**ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలియో చుక్కలు**

**ఒక్క చిన్నారి కూడా మిస్ కాకుండా తల్లిదండ్రులు సహకరించాలి**

**అంగన్‌వాడీ, ఆశా సిబ్బందికి అవగాహన**



**గణపురం, జున్ 26 (పీపుల్స్ డైరీ) :** ఐదేళ్లలోపు చిన్నారులం దరికీ పోలియో చుక్కలు వేయించాలని గణపురం వైద్య అధికారిని డాక్టర్ అనుష సూచించారు. జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వైద్యాధికారి డాక్టర్ అనూష తెలిపారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా సిబ్బంది, ఆరోగ్య సిబ్బందికి ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనూష మాట్లాడుతూ... ఆరోగ్య కేంద్రం పరిధిలో అప్పుడే పుట్టిన శిశువుల నుంచి ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. పోలియో రహిత సమాజ నిర్మాణంలో తల్లిదండ్రుల భాగస్వామ్యం ఎంతో కీలకమని పేర్కొన్నారు. కార్యక్రమం నిర్వహణ కోసం 9 పోలియో బూత్‌లతో పాటు మారుమూల ప్రాంతాల్లోని చిన్నారులను చేరుకునేందుకు 2 మొబైల్ బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆదివారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలియో చుక్కలు వేస్తామని, తల్లిదండ్రులు తమ చిన్నారులను సమీప పోలియో బూత్‌కు తీసుకువచ్చి చుక్కలు వేయించాలని కోరారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ప్రజలు కలిసి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.



## ఓరుగల్లు బల్దియాకు నూతన సారథి

### వరంగల్ నగరపాలక సంస్థ కమిషనర్‌గా టి.వెంకన్న

**మట్టెవాడ, జూన్ 26 (పీపుల్స్ డైరీ):** రాష్ట్ర పరిపాలనా యంత్రాంగంలో భాగంగా పలువురు అధికారులను స్థానచలనం చేస్తూ జారీచేసిన తాజా ఉత్తర్వుల నేపథ్యంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ తదుపరి కమిషనర్‌గా టి.వెంకన్న నియమితులయ్యారు. ఇంతకాలం హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ పరిధిలోని కోర్ అర్బన్ రీజియన్, మెట్రో రైల్ విభాగం జాయింట్ మెట్రోపాలిటన్ ప్రతినిధిగా సేవలందించిన ఆయనను ప్రస్తుతం గ్రేటర్ వరంగల్ కమిషనర్‌గా బదిలీ చేశారు. స్థానిక హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయిని ఇన్నాళ్లూ అదనపు బాధ్యతల్లో కొనసాగించిన ప్రభుత్వం బల్దియా పాలనా పగ్గాలనుంచి ఆమెను రిలీవ్ చేస్తూ శుక్రవారం ఆదేశాలిచ్చింది. తాజా నిర్ణయాలతో చారిత్రక నగర అభివృద్ధి మరింత వేగవంతం కానుందని పౌరులు ఆశిస్తుండగా, కొత్త అధికారి వెంకన్న అతి త్వరలోనే తన విధుల్లో చేరేందుకు సన్నద్ధమవుతున్నారు.

## తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

### సర్పంచ్ కట్కూరి రాధిక శ్రీనివాస్



**గణపురం, జున్ 26 (పీపుల్స్ డైరీ) :** గణపురం మండల కేంద్రంలో తాగునీటి సమస్యకు ప్రత్యేక కృషి చేస్తున్నట్లు గణపురం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కట్కూరి రాధిక శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సంత సమీపంలోని హరిజన కాలనీలో నూతన బోరుబావి తవ్వకానికి భూమి పూజ చేసి బోరు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాధిక మాట్లాడుతూ... హరిజన కాలనీలో గతంలో వేసిన బోరు పనిచేయడం లేదని దీంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతుండడంతో వారి పరిస్థితిని అర్థం చేసుకొని కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు నూతనంగా బోరు బావిని తవ్వించడం జరుగు తుందన్నారు. రాబోయే రోజుల్లో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సహకా రంతో తాగునీటి సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రేపాక రాజేందర్, అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షులు శనిగరం రాజేందర్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే గండ్ర



**చిట్యాల, జూన్ 26(పీపుల్స్ డైరీ) :** ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గృహప్రవేశ కార్యక్రమంలో శుక్రవారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు. చిట్యాల మండల కేంద్రంలోని కేతిరి సరిత అశోక్ ముసుకే నిర్మల రాజబాబు కు చెందిన నూతన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొని ప్రారంభించారు. అనంతరం వారి దంపతులకు శాలువాతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్ర మంలో చిట్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవి హౌసింగ్ శాఖ అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు రైతులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు గ్రామస్థులు పాల్గొన్నారు.

## వాన చినుకుతో చిగురించిన ఆశలు



**కేసముద్రం, జూన్ 26 (పీపుల్స్ డైరీ) :** వాన కోసం ఎదురుచూస్తున్న ఎట్టకేలకు వరుణుడు కరుణ చూపాడు. గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులు, పిడుగుల నడుమ భారీ వర్షం కురవడంతో రైతన్న కళ్లలో మళ్లీ ఆశల వెలుగులు కనిపించాయి. నెల రోజులుగా వాన లేక ఎండిన నేల తడిసి, వాడిన మనసులు చిగురించాయి. చినుకుల ప్రతి చప్పుడు పంటల పండుగకు సంకేతమైంది. విత్తనాలు వేసి వాన కోసం ఆకాశం వైపు చూస్తున్న రైతులు ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు. ఆకాశం గర్జించింది, నేల నవ్వింది, రైతన్న కళ్లలో ఆనందం పొంగింది. కురిసిన వాన పంటలపై కొత్త ఆశల వానగా మారింది. దుక్కి దున్ని సిద్ధంగా ఉన్న పొలాల్లో విత్తనాలు వేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఉరుముల మధ్య కురిసిన వాన రైతన్న గుండెల్లో ఆనందం పుట్టించింది.

## విద్యుత్ షాక్‌తో పాడి ఆవు మృతి



**మొగుళ్ళపల్లి జూన్ 26 (పీపుల్స్ డైరి):** మండలంలోని ఇస్సి పేట గ్రామంలో గండు రాజయ్యకు చెందిన పాలిచ్చే ఆవు ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో శుక్రవారం మృతి చెందింది. గ్రామస్తుల కథనం ప్రకారం ఇస్సిపేట్ మంచి నీటి బావి సమీపంలో గండు రాజయ్యకు చెందిన. 80 వేల విలువచేసే పాలిచ్చే ఆవు మేత మేసుకుంటూ వెళ్ళగానే బావికి సంబంధించిన 25 కెవిఏ విద్యుత్ సరఫరా అవుతున్న వైర్లకు ఆవు తగలడంతో షార్ట్ సర్క్యూట్‌తో మృతి చెందింది. నష్టపోయిన బాధితుడు ఘటన స్థలానికి చేరుకొని బోరున విలపించుకుంటూ. నష్టపరిహారాన్ని అందించాలని ప్రభుత్వాన్ని వేడుకొన్నారు.

# కల్లూరుగూడెం పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణ పనుల పరిశీలన

## పామాయిల్ సాగు తెలంగాణ రైతాంగానికి వరం : మంత్రి తుమ్మల





**ఖమ్మం, జూన్ 26 (పీపుల్స్ డైరీ) :** పామాయిల్ సాగు తెలంగాణ రైతాంగానికి వరంగా మారిందని దేశానికే ఆయిల్ ఫామ్ హబ్ గా తెలంగాణ రాష్ట్రం మారనుందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం నాడు ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజక వర్గం వేంసూర్ మండలం కల్లూరు గూడెం వద్ద కొత్తగా నిర్మాణం చేస్తున్న పామాయిల్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులు స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి తో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ...ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో పామాయిల్ సాగు విస్తరణలో దేశంలోనే మొదటి స్థానంలో నిలిచామని వెల్లడించారు. దేశ వ్యాప్తంగా 15 లక్షల ఎకరాల్లో పామాయిల్ సాగులో ఉండగా నూనె గింజలు ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించాలంటే 70 లక్షల ఎకరాల్లో పామాయిల్ సాగు విస్తరణ చేయాలని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా 36 శాతం సాగు విస్తరణతో దేశంలోనే తెలంగాణ తొలి స్థానంలో నిలిచిందని మంత్రి తుమ్మల సంతోషం వ్యక్తం చేశారు. ప్రతి ఏడాది భారత దేశం వంట నూనెల దిగుమతులు కోసం లక్ష కోట్ల రూపాయలు ఖర్చు చేసి నూనెలు దిగుమతి చేసుకునే పరిస్థితులు ఉండగా కేంద్ర ప్రభుత్వం పామాయిల్ ఇంపోర్ట్ టాక్స్ 44 శాతం పెంచితే దేశీయంగా రైతాంగానికి మద్దతు ధరలు పెరుగుతాయని స్వయం సమృద్ధి సాధించాలంటే కేంద్ర ప్రభుత్వం ఇంపోర్ట్ టాక్స్ పెంచాలని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, ప్రహ్లాదజోషి లను ఇటీవల డిల్లీలో కలిసి రాష్ట్ర ప్రభుత్వం తరపున విజ్ఞప్తి చేసినట్లు మంత్రి తుమ్మల వెల్లడించారు. ప్రస్తుతం పామాయిల్ ఫ్రూట్ బంచ్ టన్ను గెలలు ధర 23,852 రూపాయలు ఉందని, కనీస గ్యారంటీ ధర పాతిక వేల రూపాయలుగా కేంద్రం ప్రకటించాలని కోరినట్లు గుర్తు చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రెండు పామాయిల్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీలు ఉండగా సిద్ధిపేట జిల్లా నర్మెట్ట లో పామాయిల్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీ రైతులకు అందుబాటులో ఉండగా ఖమ్మం జిల్లాలో కల్లూరు గూడెం, కొణిజర్ల, గద్వాలజిల్లా బీచ్ పల్లి, ములుగు జిల్లా ఇంచర్ల, పెద్దపల్లి, వనపర్తి జిల్లాల్లో పామాయిల్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీలు నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయని మంత్రి తుమ్మల తెలిపారు. ఈ ఫ్యాక్టరీ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసి ఆగస్టు మాసంలో రైతులకు అందుబాటులోకి తెచ్చేందుకు వీలుగా అధికారులు కృషి చెయ్యాలని ఆదేశించారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజా పాలనలో రైతు భరోసా, రైతు భీమా పథకం, ఉచిత విద్యుత్ సరఫరా తో పామాయిల్ సాగు చేసే రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని పదిలక్షల ఎకరాల్లో పామాయిల్ సాగు విస్తరణ చేస్తే తెలంగాణ లో గ్రీన్ కవర్ పెరగటంతో పాటు రాష్ట్ర ఆర్ధిక ప్రగతిలో పామాయిల్ సాగు ముఖ్య భూమిక వహించనున్నని అని మంత్రి తుమ్మల ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రత్యామ్నాయ పంటల సాగులో భాగంగా రైతులు పామాయిల్ సాగు చేపట్టాలని మంత్రి తుమ్మల రైతాంగాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయిల్ ఫెడ్ ఉద్యాన శాఖ అధికారులున్నారు.



## తగరం వీరయ్య కుటుంబానికి చేయూత..

**ఖమ్మం, జూన్ 26 (పీపుల్స్ డైరీ) :** కారేపల్లి మండల పరిధిలోని ఎర్రబోడు గ్రామానికి చెందిన తగరం వీరయ్య కుటుంబానికి కాంగ్రెస్, సీపీఎం గ్రామ కమిటీలు ఆర్థిక సాయం అందించి భరోసాగా నిలిచారు. నిరుపేద కుటుంబమైన తగరం వీరయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన నేపథ్యంలో దశదిన కర్మల కోసమై కాంగ్రెస్ గ్రామకమిటీ నుంచి రూ.5వేలు, సీపీఎం గ్రామకమిటీ నుంచి రూ.4,700లు ఆర్థిక సాయం చేసి అండగా నిలిచారు. ఈ మేరకు ఆర్థిక సాయం చేసిన కాంగ్రెస్, సీపీఎం గ్రామకమిటీ కి కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన కాంగ్రెస్, సీపీఎం కమిటీలు ఎర్రబోడు గ్రామ ప్రజలు నిరుపేదలకు అండగా నిలుస్తూ మున్ముందు ఇలాంటి రెక్కాడితేగాని డొక్కాడని నిరుపేద ప్రజలకు అండగా నిలవాలని ప్రశంశించారు. ఆర్థిక సాయం చేసిన వారిలో కాంగ్రెస్ గ్రామ కమిటీ నాయకులు ఈసాల నాగేశ్వరావు, కురసం సత్యనారాయణ, కడియాల సుధాకర్, గాదే ఉపేందర్, భూక్యా వెంకన్న, రమేష్, సీపీఎం గ్రామ కమిటీ నాయకులు వజ్జ రామారావు, కుర్సం శ్రీను, పండగ కొండయ్య, దమ్మాలపాటి ప్రభాకర్, కాటేపల్లి నవీన్, భోజడ్ల గోవింద రావు, పవన్, వెంకన్న, తదితరులు ఉన్నారు.

## జర్నలిస్టుల హక్కుల సాధనకై కృషి : టీయుడబ్ల్యూజే




**పినపాక, జూన్ 26, (పీపుల్స్ డైరీ) :** తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ పినపాక నియోజకవర్గ డివిజన్ సమావేశం శుక్రవారం మణుగూరులో జరిగింది. జర్నలిస్టుల సంక్షేమం, వృత్తిపరమైన సమస్యలపై చర్చించిన అనంతరం నూతన డివిజన్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

### నూతనంగా ఎన్నికైన కార్యవర్గం

డివిజన్ అధ్యక్షులుగా: వెంకట్, డివిజన్ ఉపాధ్యక్షులుగా: తిప్పని శ్రీనివాస్ , కోశాధికారి గా సనప భరత్, నియోజకవర్గ కార్యవర్గ సభ్యులుగా: అండెం యాకన్న ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు వెంకట్ మాట్లాడుతూ, పినపాక నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులందరినీ ఐక్యం చేసి, వారి హక్కుల సాధనకు కృషి చేస్తామన్నారు. ప్రధానంగా అక్రిడిటేషన్, హెల్త్ కార్డులు, ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని తెలిపారు. ఉపాధ్యక్షులు తిప్పని శ్రీనివాస్ మాట్లాడుతూ, గ్రామీణ విలేకరులకు గుర్తింపు, రక్షణ కల్పించడమే తమ ప్రథమ కర్తవ్యమని పేర్కొన్నారు. కార్యవర్గ సభ్యులు అండెం యాకన్న మాట్లాడుతూ యూనియన్ బలోపేతానికి, జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా పనిచేస్తానని హామీ ఇచ్చారు. సభ్యులంతా నూతన కమిటీకి అభినందనలు తెలిపి, పూర్తి సహకారం అందిస్తామని ప్రకటించారు. ఈ సమావేశంలో పినపాక, మణుగూరు, కరకగూడెం, అశ్వాపురం, భూర్గంపహాడ్ మండలాల ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సీఎం పర్యటన భద్రత ఏర్పాట్లను పరిశీలించిన అడిషనల్ డీసీపీ



**ఖమ్మం, జూన్ 26 (పీపుల్స్ డైరీ) :** చింతకాని మండలం జగన్నాధపురంలో రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో అడిషనల్ డీసీపీ రామానుజం భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. సీఎం పర్యటించే మార్గాలు, సభా ప్రాంగణం, హెలిప్యాడ్, వాహన పార్కింగ్ ప్రాంతాలు, ప్రజల రాకపోకలకు అనువైన మార్గాలు, భద్రతా ఏర్పాట్లకు సంబంధించిన ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతా ఏర్పాట్లు, వీఐపీ కాన్వాయ్ ప్రయాణించే రూట్లలో ఎటువంటి ట్రాఫిక్ అంతరాయాలు కలగకుండా చర్యల గురించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. రైతు మేళాకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని తెలిపారు.



## సీపీఎం శిక్షణ తరగతులను విజయవంతం చేయండి...

**ఏన్కూర్, జూన్ 26 (పీపుల్స్ డైరీ) :** సీపీఎం(ఎం) వైరా డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో జూన్ 27, 28, 29 తేదీలలో ఏన్కూర్ మండలం తిమ్మారావుపేట గ్రామంలోని ఎం.కె ఫంక్షన్ హాల్ లో మూడు రోజుల పాటు పార్టీ డివిజన్ స్థాయి రాజకీయ శిక్షణ తరగతులకు పార్టీ డివిజన్ , మండల కమిటీ సభ్యులు, శాఖ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, పాల్గొని విజయవంతం చేయాలని సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం, సీపీఎం ఏన్కూర్ మండల కార్యదర్శి దొంతబోయిన నాగేశ్వరావు సంయుక్త ప్రకటనలో కోరారు. ఈ శిక్షణ తరగతుల్లో అంతర్జాతీయ, జాతీయ రాజకీయ పరిణామాలు, మార్క్సిస్టు మూల సూత్రాలు, భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) కార్యక్రమం, మూఢనమ్మకాలపై శాస్త్రీయ దృక్పథం, పార్టీ నిర్మాణం, పార్టీ పని పద్ధతులు, పార్టీ కర్తవ్యాలు, క్రమశిక్షణ తదితర ముఖ్యమైన అంశాలపై పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు బోధిస్తారని వారు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలపై అవగాహన పెంపొందించుకోవడానికి, ప్రజా ఉద్యమాలను మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లడానికి ఈ రాజకీయ శిక్షణ తరగతులు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

## ఆదివాసీ యువత మైపతితో "మాట--ముచ్చట"



**పినపాక, జూన్ 26(పీపుల్స్ డైరీ) :** పినపాకలో ఆదివాసీ యువతతో తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు మైపతి అరుణ్ కుమార్ ముఖాముఖి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం జానంపేట గ్రామంలో ఆదివాసీ యువతతో "మాట--ముచ్చట" కార్యక్రమం నిర్వహించనున్నారు. ఆదివాసీ యువత సమస్యలు, హక్కులు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి పోలేబోయిన వెంకటనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమం జూన్ 28వ తేదీ ఆదివారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జానంపేట గ్రామంలోని నాగులమ్మ ఆలయ ప్రాంగణంలో జరగనుంది. ఈ కార్యక్రమానికి తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షులు మైపతి అరుణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ఆదివాసీ యువతతో మాట్లాడనున్నారు. ఆదివాసీ హక్కుల పరిరక్షణ, చట్టాల అమలు, యువత పాత్ర తదితర అంశాలపై ఆయన తన అభిప్రాయాలను పంచుకోనున్నారు. ఆదివాసీ గూడాల్లోని యువత అధిక సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను తెలియజేసి, హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు

## అనుమతులు లేని స్కూల్స్‌ను వెంటనే రద్దు చేయాలి

### టీఎస్ఎస్ఏ వరంగల్ జోన్ ఇన్‌చార్జ్ దమళ్ల సత్యం



**ఖమ్మం, జూన్ 26 (పీపుల్స్ డైరీ) :** రాష్ట్రంలోని ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు అధిక ఫీజులతో పాటు పుస్తకాలు, స్కూల్ డ్రెస్‌లు, ఇతర సామగ్రి పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వేలాది రూపాయలు వసూలు చేస్తూ విద్యను పూర్తిగా వ్యాపారంగా మార్చాయని తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ (టిఎస్ ఎస్ఏ) వరంగల్ జోన్ ఇన్‌చార్జ్ దమళ్ల సత్యం తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు పిల్లల చదువుల కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే రాష్ట్రవ్యాప్తంగా ఫీజు నియంత్రణ కమిటీని ఏర్పాటు చేసి ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజులను నియంత్రించాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో అడ్మిషన్ ఫీజు, ట్యూషన్ ఫీజు, ప్రత్యేక ఫీజుల పేరుతో లక్షల రూపాయలు వసూలు చేస్తుండటంతో పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుని ఫీజులపై పారదర్శక విధానాన్ని అమలు చేయాలని, నిబంధనలు ఉల్లంఘించే విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని దమళ్ల సత్యం డిమాండ్ చేశారు. అదేవిధంగా సీబీఎస్ఈ (సిబిఎస్ఈ) పేరుతో ప్రచారం చేసుకుంటూ సరైన అనుమతులు, గుర్తింపు లేకుండానే అనేక ప్రైవేట్ పాఠశాలలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఇటువంటి విద్యాసంస్థలపై జిల్లా కలెక్టర్లు, విద్యాశాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘిస్తున్న పాఠశాలల అనుమతులను రద్దు చేసి, నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడే విద్యాసంస్థలను ప్రభుత్వం ఉపేక్షించరాదని, ఫీజుల దోపిడీ, పుస్తకాలు, యూనిఫాంలను బలవంతంగా కొనుగోలు చేయించడం వంటి అక్రమాలను అరికట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బుయ్యన వీరబాబు, వరద సాయికుమార్, సతీష్ తదితరులున్నారు.

## విద్యార్థులను పాఠశాలకు రప్పిస్తున్న డిప్యూటీ వార్డెన్



**ఏన్కూర్, జూన్ 26 (పీపుల్స్ డైరీ) :** ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలు ప్రారంభమై పది రోజులు గడుస్తున్నా హాస్టల్ మరియు పాఠశాలకు నేటికి రాకపోవడం వలన పాఠశాలకు దూరంగా ఉన్న విద్యార్థులను గుర్తించి వారి గ్రామాలను సందర్శించి తిరిగి పాఠశాలకు చేర్పించే బాధ్యతను నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మూలపోచారం పాఠశాల డిప్యూటీ వార్డెన్ డిఎస్.నాగేశ్వరరావు ఇంటి బాట పట్టారు . కొత్త మేడేపల్లి గ్రామం సర్పంచ్ పంచాయతీ కార్యదర్శి విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి సమావేశమై పిల్లలు పాఠశాలలకు దూరం కావడానికి గల కారణాలను తెలుసుకున్నారు ప్రతి విద్యార్థులు తప్పనిసరిగా విద్యను కొనసాగించేలా తల్లిదండ్రులు బాధ్యత వహించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వివరించారు. నూతన విద్యార్థులను పాఠశాలలలో చేరుటకు వారు ప్రయత్నం చేశారు.బడికి దూరంగా ఉన్న విద్యార్థులను గుర్తించి మండలానికి సుదూర ప్రాంతాలైన జంపా నగర్, కొత్త మేడేపల్లి, ఊటవాగు, తుంగారం తదితర గ్రామాలను సందర్శించి వారి తల్లిదండ్రులతో మరియు అక్కడున్న గ్రామ పెద్దలతో మాట్లాడి పాత విద్యార్థులు అయిన సాయి చరణ్, మోహన్, నీల రామ్ నాయక్, సాయి వర్షిత్, భరత్, రవీందర్, మల్ల, గంగరాజు, దేవా, సునీల్, విజయ్, మురళి, గోపి అను విద్యార్థులను తిరిగి పాఠశాలకు రప్పించుటకు వారు ప్రయత్నం చేశారు. పాఠశాలకు పంపించడానికి వారి తల్లిదండ్రులు హామీ ఇచ్చారు. పలు గ్రామాలను సందర్శించి విద్యార్థులను పాఠశాలకు రప్పించడానికి వారు చేస్తున్న కృషిని తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు.

# రైతుమేళాను వినియోగించుకోవాలి

## చింతకాని మండలం జగన్నాథపురం వద్ద స్టాల్స్, స్టేజి, భోజనం వసతులు, పార్కింగ్ ఏర్పాట్ల పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్

### 150 స్టాళ్లతో అధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన ప్రదర్శనలు

### జూన్ 30న నిర్వహించే రైతు ఆశీర్వాద సభకు పకడ్బందీగా ఏర్పాట్లు

### సీఎం రేవంత్ రెడ్డి పర్యటన కు కట్టుదిట్టమైన భద్రత



**ఖమ్మం, జూన్ 26 (పీపుల్స్ డైరీ) :** ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలోని చింతకాని మండలం జగన్నాథపురం వద్ద ఈ నెల 28, 29, 30 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి రైతు మేళా, ముఖ్యమంత్రి రైతు ఆశీర్వాద సభ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమ ప్రాంగణంలోని స్టాళ్లు, ప్రధాన వేదిక, భోజనశాలలు, పార్కింగ్ స్థలాలు, ప్రజల రాకపోకల మార్గాలు, పారిశుధ్య ఏర్పాట్లు, తాగునీటి వసతులు తదితర అంశాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ... జూన్ 28, 29, 30 తేదీల్లో నిర్వహించే రైతు మేళాలో 150కు పైగా స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయం, ఉద్యానవనం, పశు సంవర్ధక, మత్స్య, పాల ఉత్పత్తి, సేంద్రీయ వ్యవసాయం, వ్యవసాయ యాంత్రీకరణ, ఆధునిక సాగు పద్ధతులు, విలువ ఆధారిత ఉత్పత్తులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వంటి విభిన్న రంగాలకు సంబంధించిన ప్రదర్శనలు రైతులకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లాతో పాటు పరిసర ప్రాంతాల రైతులు సద్వినియోగం చేసుకొని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలుసుకోవాలని పిలుపునిచ్చారు. రైతులకు ప్రత్యక్ష అనుభవం కలిగేలా ఆధునిక వ్యవసాయ యంత్రాల ప్రదర్శనలు, అధిక దిగుబడులు అందించే సాగు పద్ధతులపై ప్రత్యేక డెమోలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణులతో ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించి రైతుల సందేహాలకు ప్రత్యక్షంగా సమాధానాలు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతు మేళాకు వచ్చే ప్రతి రైతుకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, మరుగుదొడ్లు, వైద్య శిబిరాలు, భోజన వసతులు, సమాచార కేంద్రాలు, తగిన సంఖ్యలో కౌంటర్లు, విశాలమైన పార్కింగ్ సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. మహిళా రైతులు, వృద్ధులకు సౌకర్యాలను ప్రత్యేకంగా దృష్టిలో ఉంచుకుని ఏర్పాట్లు చేయాలని సూచించారు. జూన్ 30న నిర్వహించే ముఖ్యమంత్రి రైతు ఆశీర్వాద సభకు భారీ సంఖ్యలో రైతులు, ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి ఏర్పాట్లను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులకు కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట రెవెన్యూ, పోలీసు, వ్యవసాయ, పశుసంవర్ధక, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, విద్యుత్, వైద్య ఆరోగ్య, మిషన్ భగీరథ, ఇంజినీరింగ్ శాఖల అధికారులు తదితరులున్నారు.

పీపుల్స్ డైరీ
వరంగల్
శనివారం, 27 జూన్ 2026
సంపుటి : 18, సంచిక : 113






# మాదకద్రవ్యాలను సమాజానికి దూరం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత

**జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**

**డ్రగ్స్, మత్తు పానీయాలు సేవించడం వ్యాధి కంటే ప్రమాదకరం**

**ప్రజల సహకారంతో గంజాయి రహిత సమాజమే లక్ష్యం: పోలీస్ కమిషనర్ సునీల్ దత్**

**డ్రగ్స్ బారిన పడినట్లు అనుమానం వస్తే 1908 కు సమాచారం అందించాలి**

**ఖమ్మం, జూన్ 26 (పీపుల్స్ డైరీ) :** మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మించడానికి ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని, బాధ్యతగా కృషి చేయాలని, జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఉదయం ఖమ్మం నగరం మమత రోడ్డు లోని వివిసి టాటా సర్వీస్ సెంటర్ నుంచి లాకారం ట్యాంక్ బండ్ వరకు నిర్వహించిన అవగాహన ర్యాలీని జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య లతో కలిసి ప్రారంభించారు. విద్యార్థులు, యువత, పోలీస్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తో కలిసి రన్ లో కలెక్టర్, పోలీస్ కమిషనర్ లు పాల్గొని స్ఫూర్తినిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ... దేశ నిర్మాణంలో యువత పాత్ర చాల కీలకమని, యువతకు ఉపాధి కల్పన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారీగా నిధులు కేటాయిస్తూ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాయని అన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల విక్రయాలు, చట్టవిరుద్ధమైన కార్యకలాపాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే తక్షణమే అప్రమత్తం కావాలని అన్నారు. యువత డ్రగ్స్ బారిన పడకుండా కాపాడుకోవాలని, మాదకద్రవ్యాలు, మత్తు పానీయాలు సేవించడం వ్యాధి కంటే ప్రమాదకరమని వివరించారు. డ్రగ్స్ వాడకం వల్ల ఒకరి జీవితం మాత్రమే ప్రభావితం కాదని, కుటుంబం, సమాజాన్ని నాశనం చేస్తుందని అన్నారు. డ్రగ్స్ నియంత్రణ కేవలం అధికారులు మాత్రమే చేయలేరని, ప్రజలంతా సమిష్టిగా ఉంటూ అధికారులకు సహకరిస్తేనే మెరుగైన ఫలితాలు లభిస్తాయని కలెక్టర్ తెలిపారు. డ్రగ్స్ వాడకం ప్రారంభించకముందే మనమంతా మేల్కొనాలని, యువత డ్రగ్స్ వంటి వాటి వైపు వెళ్లకుండా దూరంగా ఉండాలని, తమ ఉజ్వల భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని సూచించారు. మాదక ద్రవ్యాల రహిత సమాజమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యాసంస్థలు, ఆరోగ్యశాఖ, మాదకద్రవ్య నివారణ సంస్థలు, సమాజం అందరూ కలిసి సమష్టిగా చైతన్యం పెంచినప్పుడే మాదకద్రవ్యాల ప్రమాదం నుంచి దూరంగా ఉంచి ఆరోగ్యకరమైన భవిష్యత్తు అందించగలుగుతామన్నారు. పోలీస్ కమీషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ... మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరు భాగస్వాములై భావితరాలకు మంచి భవిష్యత్ అందించాలని అన్నారు. యువత దృష్టి అంతా జీవిత లక్ష్యంపై మాత్రమే ఉండాలని, నిషేధిత గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలకు విద్యార్థులు ఆకర్షితులు కావద్దని సూచించారు. గంజాయి, డ్రగ్స్‌కు అలవాటు పడితే మానసిక, శారీరక ఆరోగ్యాన్ని పాడు చేస్తుందన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలన, గంజాయి రహిత సమాజమే లక్ష్యంగా పోలీసుశాఖ కృషి చేస్తుందన్నారు. ఇందులో భాగంగానే విద్యాసంస్థలు, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తునమన్నారు. ఎక్కడైనా గంజాయి, ఇతర మత్తుపదార్థాలు విక్రయిస్తున్నట్లు, తాగుతున్నట్లు తెలిస్తే వెంటనే 1908కు సమాచారం అందించాలన్నారు. మీ వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని అన్నారు. అనంతరం ప్రజలు, యువత, విద్యార్థులు, అధికారులతో కలిసి డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం పై ప్రతిజ్ఞ చేశారు. తర్వాత "ఐయామ్ యాంటీ డ్రగ్ సోల్జర్స్" సెల్ఫ్ పాయింట్ వద్ద ఫోటోలు దిగడంతో పాటు సైన్ బోర్డు వద్ద సంతకాలు చేసి మాదకద్రవ్యాల నిర్మూలనకు తమ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ రమణమూర్తి, ఎస్బి ఏసీపీ మహేష్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, ఇన్స్పెక్టర్లు, ఎస్సైలు, అధికారులు, యువత, విద్యార్థులు తదితరులున్నారు.

# మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై అవగాహన : రూరల్ ఏసిపి తిరుపతిరెడ్డి




**ఖమ్మం, జూన్ 26 (పీపుల్స్ డైరీ) :** మాదక ద్రవ్యాల దుర్వినియోగం, మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన కార్యక్రమాన్ని ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో రూరల్ డివిజన్ పోలీస్ అధికారులు, సిబ్బంది, స్థానిక యువత తో కలసి పోలీస్ స్టేషన్ నుండి ఎదులాపురం క్రాస్ రోడ్డు వరకు మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్బంగా రూరల్ ఏసీపీ మాట్లాడుతూ... నేటి యువత మాదకద్రవ్య రహితంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని అన్నారు. యువత ఎటువంటి దురలవాట్లకు బానిస కాకుండా సన్మార్గంలో నడిచి జీవితంలో ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. దేశాభివృద్ధికి వెన్నెముకగా నిలవాల్సిన యువత మాదకద్రవ్యాలకు బానిసలైతే, అది వ్యక్తిగత జీవితాలను మాత్రమే కాకుండా దేశ భవితనే ప్రమాదంలోకి నెడుతుందన్నారు. డ్రగ్స్ వ్యసనంతో యువత విద్య, ఉపాధి, ఆరోగ్యం, మానసిక స్థితి దెబ్బతింటాయన్నారు.

# యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి!

## మట్టెవాడ సర్కిల్ ఇన్స్పెక్టర్ కరుణాకర్

**మట్టెవాడ, జూన్ 26 (పీపుల్స్ డైరీ):** అంతర్జాతీయ మాదకద్రవ్య దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా యూత్ పర్ సొసైటీ వరంగల్, మట్టెవాడ పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో వరంగల్ ఎంజిఎం ఆసుపత్రి సర్కిల్లో శుక్రవారం ఉదయం మత్తు పదార్థాల వ్యతిరేక ర్యాలీ, మానవహారం దాని అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మట్టెవాడ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కరుణాకర్ వాలంటీర్లనుద్దేశించి మాట్లాడుతూ కొంతమంది యువత మాదకద్రవ్యాలకు బానిసలు అవుతున్నారని దీనివల్ల తమ ఆరోగ్యాన్ని కుటుంబ సభ్యుల మనోవేదన, తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఈ విషయంపై యువతకు అవగాహన కలిగించడం అత్యవసరమని అన్నారు. దీనికి పోలీస్ డిపార్ట్మెంట్ వారు మాదకద్రవ్య అక్రమ రవాణా అరికట్టడంలో చేస్తున్న కృషికి/ ప్రయత్నానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు, సమాజం, ఎన్జీవోస్, ప్రతి పౌరుడు సహకరించాలని కోరారు. అలాగే యూత్ ఫర్ సొసైటీ ఫౌండర్ కొడిమాల శ్రీనివాసరావు మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలకు 'నో ' చెప్పాలని ఆరోగ్యకరమైన జీవితానికి 'ఎస్' చెప్పాలని దీనిపై యూత్ ఫర్ సొసైటీ వాలంటీర్స్ నిరంతరం విద్యార్థులను చైతన్య పరుస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో మట్టెవాడ లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులు ఎన్ఎస్ఎస్, యూత్ ఫర్ సొసైటీ వాలంటీర్లు దేవిశ్రీ ప్రసాద్, సాత్విక్, విష్ణు, రుత్విక్, సాయి, జయంత్, ప్రసాద్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.






# వందేమాతర గీతానికి సలాం

**వరంగల్, జూన్ 26 (పీపుల్స్ డైరీ) :** వరంగల్ రామన్నపేట లోని డాక్టర్ .ఏ. రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వందేమాతర గీతాన్ని రచించిన మహానుభావుడు బంకింగ్ చంద్ర చటర్జీ జయంతిని పురస్కరించుకొని మా ట్రస్టు తరఫున నివాళులర్పించారు. వందేమాతర గీతాన్ని రచించిన మహానుభావుడు బంకించంద్ర చటర్జీ. దేశభక్తికి ఊపిరి పోసి మన భారతీయ పౌరులందరికీ నర నరాలలో దేశభక్తిని ఇనుమడింపజేసిన మహానుభావుడు. దేశం కోసం త్యాగం, క్రమశిక్షణ కర్తవ్య దక్షిత చాలా ముఖ్యమన్నారు. అలాగే ప్రతి పౌరుడు దేశం కోసం కలసి మెలిసి ప్రేమ ఐక్యమత్యంతో పాటు అనురాగంతో ఉండాలని అన్నారు. వందేమాతరం అని గుండె నిండా చెప్పుకుందాము. అలాగే ప్రతి పాఠశాలలో విధిగా దీని గురించి విద్యార్థులకు వివరించేటట్లుగా ప్రతి రోజు జరిపే ప్రార్ధన సమయంలో విద్యార్థుల కు తెలియయాలని ప్రభుత్వం వారికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ ట్రస్ట్ డాక్టర్ .ఏ.రాజేంద్రప్రసాద్ తో పాటు ఆర్గనైజర్ శ్రవణ్, మిట్టపల్లి సమ్మయ్య, డోలి ఎల్లయ్య, రామ శ్రీనివాస్, తాటి పెల్లి ప్రకాష్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారులారా ఛలో కొడంగల్ భారీ ప్రదర్శన జయప్రదం చేయండి



**ఖమ్మం, జూన్ 26 (పీపుల్స్ డైరీ) :** కె.కె.కమిటీ పేరుతో కాలయాపన చేయకుండా తెలంగాణ ఉద్యమ కారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జూన్ 28న ఛలో కొడంగల్ లో ప్రదర్శన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి ఖమ్మం జిల్లా కన్వీనర్ డాక్టర్ పాలకుర్తి కృష్ణ, రాష్ట్ర కార్యదర్శి పెళ్కూరి విజయకుమార్, మీడియా ఇన్చార్జి మంద వెంకటేశ్వర్లు తెలిపారు. జూన్ 28న ఛలో కొడంగల్ విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం ఖమ్మం జిల్లా ఉద్యమకారుల ఫోరం జిల్లా కార్యాలయంలో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కోసం అనేక పోరాటాలు, ఉద్యమాలు చేసిన ఉద్యమకారులకు ఎన్నికల మ్యాన్ పెస్టోలో ఇచ్చిన హామీలను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేస్తానని అందుకు కె.కె కమిటీ ఏర్పాటు చేశారు. కమిటీ పేరుతో కాలయాపన చేయకుండా ఉద్యమ కారుల ఆకాంక్ష నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో జూన్ 28న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్ లో జరిగే వందలాది కార్లతో ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు, తెలంగాణ రాష్ట్రంలో 33 జిల్లాల నుండి ఉద్యమకారులు భారీగా చేవెళ్ల చేరుకోవాలని పెద్ద ఎత్తున కారులతో ర్యాలీగా కొడంగల్ నియోజకవర్గం రేవంత్ రెడ్డి ఇంటి వరకు చేరుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం కమిటీ సభ్యులు ఎదురుగట్ల చిట్టిమల్లు, పాలకుర్తి భద్రయ్య, బాలిన భాస్కర్ రెడ్డి, జానీ, కొరివి ధనలక్ష్మి, పోతురాజు రమాదేవి, బొడ్డు గ్లోరీ, రోజా మరియా, తదితరులు పాల్గొన్నారు.

# స్పోర్ట్స్ సెక్రటరీస్ ఎలేవేన్ టీమ్ ఘన విజయం



**ఖమ్మం లీగల్, జూన్ 26 (పీపుల్స్ డైరీ) :** బార్ అసోసియేషన్, మాజీ స్పోర్ట్స్ సెక్రటరీస్ ఆధ్వర్యంలో ఖమ్మం నగరం లోని స్థానిక డక్కెన్ క్రికెట్ గ్రౌండ్సలో న్యాయవాదుల క్రికెట్ మ్యాచ్ జరిగింది, ఈ మ్యాచ్ ని బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ యడ్లపల్లి రమేష్ న్యాయవాద క్రీడాకారులను పరిచయం చేసుకోగా, జనరల్ సెక్రటరీ కొప్పుల రవి కుమార్ టాస్ వేశారు. మాజీ స్పోర్ట్స్ సెక్రటరీస్ కెప్టెన్ రావుల వెంకట్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకోగా టీమ్ లో గద్దల దిలీప్ చక్కటి బ్యాటింగ్ బోలింగ్ తో రాణించారు. రావుల వెంకట్ టీమ్ నిర్ణత 12 ఓవర్లకు గాను 124 పరుగులు చేయగా, యర్ర జ్ఞానేష్ టీమ్ 84 పరుగులు మాత్రమే చేయగా బోలింగ్ లో గద్దల దిలీప్ 4 వికెట్లు, కొండా రాజేష్ రెండు వికెట్లు, మర్రి ప్రకాష్ కీలకమైన వికెట్ తీయగా కొప్పుల కృష్ణ, గరికే సంపత్ చెరో వికెట్ తో దారవత్ ప్రసాద్ అద్భుతమైన క్యాచ్ తో అలరించగ, రావూరి శ్రీను కీపింగ్ తో అద్భుతమైన ప్రదర్శన చేశారు. రాయల పావెల్, చార్లెస్, వినయ్, గుగులోత్ వరుణ్, రాందాస్ నాయక్, ఉండి శివ, కోపిల రవికుమార్ లు వెంకట్ టీమ్ ఘన విజయం లో కీలకం గా వ్యవహారించారు, అంపైర్లు గా పువ్వాడ రంగారావు, చింతల పవన్ వ్యవరించారు. చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బిల్లా శ్రీనివాస్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

# ఓ-సిటీలో కుడా రెసిడెన్షియల్ ప్లాట్ల వేలం


## 39 ప్లాట్లు విక్రయం..- గజానికి గరిష్ఠంగా రూ.75 వేల ధర నమోదు

హన్మకొండ, జూన్ 26 (పీపుల్స్ డైరీ): వరంగల్‌లోని ఓ-సిటీ టౌన్‌షిప్‌లో కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన రెసిడెన్షియల్ ప్లాట్ల బహిరంగ వేలం జరిగింది. ఈ వేలంలో హనుమకొండ జిల్లా కలెక్టర్, కుడా వైస్ చైర్‌పర్సన్ శ్రీమతి చాహత్ బాజ్‌పాయి, పాల్గొని వేలం ప్రక్రియను పర్యవేక్షించారు. మొత్తం 45 రెసిడెన్షియల్ ప్లాట్లను వేలానికి ఉంచగా, వాటిలో 39 ప్లాట్లు విక్రయమయ్యాయి. వేలంలో గజానికి గరిష్ఠంగా రూ.75,000 ధర నమోదు అయింది. ప్లాట్లకు ప్రభుత్వం నిర్ణయించిన కనీస (అప్‌సెట్) ధర గజానికి రూ.48,000గా ఉండగా, అన్ని ప్లాట్లు ఆ ధర కంటే అధిక ధరకే విక్రయమయ్యాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ, కుడా అభివృద్ధి చేస్తున్న లేఅవుట్లకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. నాణ్యమైన మౌలిక సదుపాయాలతో అభివృద్ధి చేసిన ప్లాట్లకు మంచి డిమాండ్ ఉండటం నగర అభివృద్ధికి సానుకూల సంకేతమని పేర్కొన్నారు. వేలం ప్రక్రియను కుడా అధికారులు సిపిఓ అజిత్ రెడ్డి, ఈఈ భీం రావు లు పారదర్శకంగా నిర్వహించగా, పెద్ద సంఖ్యలో కొనుగోలుదారులు పాల్గొన్నారు.

# పీఎంశ్రీ పథకాన్ని అంగన్వాడి కేంద్రాలలో అమలు చేయాలి

**తెలంగాణ అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్**





**ఇల్లందు (భద్రాద్రి కొత్తగూడెం) జూన్ 26 (పీపుల్స్ డైరీ) :** సీఐటీయూ ఆఫీసులో కల్లేపల్లి అధ్యక్షతన జరిగిన అంగన్వాడీ సదస్సులో ముఖ్య అతిథిగా యూనియన్ జిల్లా కార్యదర్శి జీ పద్మ పాల్గొని మాట్లాడుతూ పేద కుటుంబాలకు చెందిన గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు 0-5 సంవత్సరాల చిన్నారులకు పోషకాహార పంపిణీ, ఆరోగ్య సేవలు, పిల్లల సంరక్షణ, సంక్షేమం విద్య, మానసిక వికాసం కోసం 50 సంవత్సరాలు గా అంగన్వాడి కేంద్రాల ద్వారా వాటిలో పనిచేస్తున్న టీచర్లు, హెల్పర్లు కృషి చేస్తున్నారని ఆమె అన్నారు నూతన విద్యావిధానంలో భాగంగా ఇప్పుడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏకమై పీఎం శ్రీ పథకాన్ని తెచ్చారని దానివల్ల భవిషత్తు లో అంగన్వాడీ నిర్వీర్యం చేసి ఎత్తివేసే కుట్ర జరుగుతోందని అన్నారు. పీ ఎం శ్రీ నిధులు అంగన్వాడికి ఇవ్వాలని ఐసిడీఎస్ ను బలోపేతం చేయడానికి ప్రతి అంగన్వాడీ నడుం బిగించి పోరాటానికి సన్నద్ధం కావాలని పిలుపు నిచ్చారు. సిఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు అబ్దుల్ నబీ మాట్లాడుతూ అంగన్వాడీ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సారమ్మ, ఫాతిమా, ఆరెం అరుణ, ఆలేటి సంధ్య, రాంబాయి, దీప్తి, వెంకటమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **KONDAPARTHI KIRAN,** PRINTED AT RATNA GRAPHICS, 2-3-703/7, THIRUMALA NAGAR COLONY, OPP : POLICE LINE, AMBERPET, HYDERABAD, TELANGANA - 500013, PUBLISHED AT H.NO. 3-4-396, NEW RAYAPURA, HANAMKONDA, WARANGAL, TELANGANA - 506001.
**EDITOR : KONDAPARTHI KIRAN.RNI NO: TEL/TEL/2009/28544, CELL:9493019044,** e-mail : peoplesdairydaily@gmail.com